పారిపోండ్రోయ్..!

- వైసీపీ సోషల్ మీడియా సైకోల్లో అలజడి
- అసభ్యకర పోస్టులపై చర్యలకు దిగిన ప్రభుత్వం
- గుంటూరులో హరికృష్ణారెడ్డి అరెస్టుతో గుబులు
- అప్పట్లో క్లాక్ టవర్ వద్ద మీసం దువ్వి హల్‌చల్
- జిల్లాలో పలువురికి నోటీసులు.. మరికొందరి గుర్తింపు
- సిద్ధం సభలో శ్రీకృష్ణపై దాడిచేసిన వారికోసం వేట





క్లాక్ టవర్ వద్ద హల్‌చల్ చేస్తున్న హరికృష్ణారెడ్డి(ఫైల్)

అనంతపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులతో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న వైసీపీ సైకోలపై కూటమి ప్రభుత్వం చర్యలకు దిగింది. క్షేత్రస్థాయిలో దూకుడు పెంచింది. అధికారంలోకి రాకముందు, ఆ తరువాత కూటమి నేతలపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినవారిపై కఠిన చర్యలకు దిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కూటమి నాయకులు, ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగిస్తున్న వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలను జిల్లా పోలీసు యంత్రాంగం గుర్తిస్తోంది. ఇప్పటికే కొందరికి 41 నోటీసులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన బుక్కరాయసముద్రం జడ్పీటీసీ, వైసీపీ నాయకుడు భాస్కర్, ఆ పార్టీ కార్యకర్తలు సాకే లక్ష్మీనారాయణ, నిమ్మల భాస్కర్‌కు విజయవాడ సైబర్ క్రైం పోలీసులు రెండు రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులకు ఎలాంటి ఆధారాలు ఉన్నాయో తీసుకుని విజయవాడ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు రావాలని నోటీసులో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై అసభ్యకర పోస్టులు పెట్టిన బెళుగుప్ప మండలం నక్కలపల్లికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త సంజీవరెడ్డిని పుట్టపర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతనిపై తిరుపతిలో కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా సంజీవరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాల నేపథ్యంలో అప్పట్లో రెచ్చిపోయిన పలువురు పారిపోతున్నారు.

కల్లం అరెస్టు నేపథ్యంలో..

గుంటూరు జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు కల్లం హరికృష్ణారెడ్డి సార్వత్రిక ఎన్నికలకు ముందు అనంతపురం జిల్లాకు వచ్చాడు. నగర నడిబొడ్డున టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ను అసభ్య పదజాలంతో దూషించాడు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించాడు. దీంతో కల్లం హరికృష్ణారెడ్డిపై పోలీసులు అప్పట్లోనే కేసు నమోదు చేశారు. దీంతో పాటు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులపైనా కేసులు నమోదయ్యాయి. గుంటూరు పోలీసులు కల్లంను అరెస్టు చేయగానే.. అతనితో కలిసి అప్పట్లో హల్‌చల్ చేసిన వైసీపీ స్థానిక నాయకులు, కార్యకర్తల్లో అలజడి మొదలైంది. స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తల సహకారంతోనే కల్లం హరికృష్ణారెడ్డి అనంతపురం నగరానికి వచ్చాడు. క్లాక్ టవర్ వద్ద రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. ఈ వ్యవహారానికి బాధ్యులను గుర్తించే పనిలో జిల్లా పోలీసు యంత్రాంగం నిమగ్నమైనట్లు సమాచారం. అప్పటి వీడియోలను క్షుణ్ణంగా పరిశీలించి, పాల్గొన్నవారికి ముందుగా నోటీసులు ఇవ్వాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న కొందరు ఇప్పటికే జిల్లాను వీడినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

జైలుకు జింక..!



అనంతపురం క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబు తదితరులపై అభ్యంతరకర పోస్టులు పెట్టినందుకు ఆత్మకూరు మండలం మదిగుబ్బ గ్రామానికి చెందిన జింకల రామాంజినేయులును పోలీసులు అరెస్ట్ చేశారు. అతన్ని శుక్రవారం కోర్టుకు హాజరుపరి, న్యాయాధికారి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. టీడీపీ ఆత్మకూరు మండలం కన్వీనర్ గంతి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు రామాంజినేయులుపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేశ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి, సంభాషణలను వక్రీకరించి జింకల రామాంజినేయులు పోస్టులు పెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్ నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టు ఈ నెల 21వరకు రిమాండ్ విధించింది.



జడ్పీటీసీ భాస్కర్



నిమ్మల భాస్కర్



లక్ష్మీనారాయణ



సంజీవరెడ్డి

శ్రీకృష్ణపై దాడి చేసినవారికోసం వేట..!



శ్రీకృష్ణపై దాడి చేస్తున్న మూక

సార్వత్రిక ఎన్నికలకు ముందు రాప్తాడు మండల కేంద్రంలో వైసీపీ అధినేత, అప్పటి సీఎం జగన్ సిద్ధం సభను నిర్వహించారు. కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు విచక్షణారహితంగా దాడి చేశాయి. ఈ దాడిపై శ్రీకృష్ణ రాప్తాడు పోలీసులకు అప్పట్లోనే ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడినవారి వివరాలు, ఫొటోలతో ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలను ప్రచురించింది. వైసీపీ అధికారంలో ఉండటంతో పోలీసులు ఆ దాడిని సీరియస్‌గా తీసుకోలేదు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల కారణంగా ఒకరిని మాత్రమే అరెస్టు చేసి చేతులు దులుపుకున్నారు. ఆ తరువాత ఆ కేసును అటకెక్కించారు. శ్రీకృష్ణపై దాడి చేసినవారిలో ఆరుగురిని గుర్తించామని అప్పటి ఎస్పీ అన్బురాజన్ ప్రకటించారు. కానీ వారి వివరాలను వెల్లడించలేదు. తాజాగా ఈ కేసు ఫైల్‌ను కూడా పోలీసులు దుమ్ము దులుపుతున్నారని తెలిసింది.





సిద్ధం సభలో అరాచకం



విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అపార్ కౌంటర్లను పెంచండి

- కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అపార్ జనరేషన్ కోసం కౌంటర్ల సంఖ్యను పెంచాలని కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. అనంతపురం రూరల్ పంచాయతీలోని రూరల్ మండలం ఎమ్మార్సీని శుక్రవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. సంబంధిత అధికారులతో అపార్ జనరేషన్ ప్రక్రియపై ఆరా తీశారు. ఎమ్మార్సీలో కంప్యూటర్ల సంఖ్య పెంచాలన్నారు. తద్వారా అపార్ ప్రక్రియను వేగంగా, ప్రశాంతంగా చేపట్టేందుకు వీలవుతుందన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, డీఈఓ ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

11లోగా ఫ్రీహోల్డ్ పరిశీలన పూర్తవ్వాలి

అనంతపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ భూముల పరిశీలన ప్రక్రియను ఈనెల 11లోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జేసీ, డీఆర్‌ఓ, ఆర్డీఓలు, తహసీల్దార్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈపరిశీలన ప్రక్రియ ఇప్పటికే ముగియాల్సి ఉందన్నారు. కానీ ఇంకా అనేక చోట్ల పరిశీలన పెండింగ్‌లో ఉందన్నారు. ప్రధానంగా కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని కంబదూరు, కుందుర్పి మండలాలలో ఇది ఎక్కువ ఉందన్నారు. కళ్యాణదుర్గం ఆర్డీఓ ప్రత్యేక దృష్టిపెట్టి ఆభూముల పరిశీలన ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశీలన పెండింగ్ ఉన్న మండలాలలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి త్వరగా ముగించాలని సూచించారు. ఈనెల11లోగా పూర్తి చేసి సంబంధిత నివేదికలను డీఆర్‌ఓకు అప్పగించాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు, సందేహాలు ఉంటే వెంటనే పై అధికారులతో మాట్లాడి నివృత్తి చేసుకోవాలని తహసీల్దార్లకు కలెక్టరు సూచించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కలెక్టరు హెచ్చరించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్‌ఓ మలోల, ఆర్డీఓ వసంతబాబు, కలెక్టరేట్ సెక్షన్ ఏఓ రియాజుద్దీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రబీ టమోటాకు బీమా

- ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు

అనంతపురం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సీజన్‌లో సాగు చేసే టమోటా పంటకు వాతావరణ ఆధారిత బీమాను వర్తింపజేసినట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రబీ సీజన్‌లో అక్టోబరు 15 నుంచి డిసెంబరు 15 దాకా సాగు చేసిన పంటకు వాతావరణ పరిస్థితుల వల్ల నష్టం జరిగితే బీమా అందుతుందన్నారు. ఇందుకోసం జిల్లాకు అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కంపెనీని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎకరాకు రూ.1600 చొప్పున రైతులు ప్రీమియం చెల్లిస్తే పంటనష్టం జరిగినప్పుడు రూ.32వేల బీమాను పొందవచ్చని తెలిపారు. టమోటా పంట సాగుకు బ్యాంక్ రుణం తీసుకునే రైతులు ఆయా బ్యాంకుల్లో ప్రీమియం చెల్లించాలన్నారు. పంట రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ లేదా రైతు సేవా కేంద్రంలో భూమి వన్‌బీ, ఆధార్, బ్యాంక్ అకౌంట్, పంట ధ్రువీకరణ పత్రాలను సమర్పించి ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. వివరాలకు అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా మేనేజర్ కృష్ణసాగర్ నెంబర్ 9912275799ను సంప్రదించాలని కోరారు.

మింగిన సొమ్ము.. అంతేనా..?

- జగనన్న ఇళ్లలో రూ.2.08 కోట్ల స్వాహా
- అక్రమాలు నిర్ధారణ.. ఏడుగురిపై చర్యలు
- మిగిలిన 12 మందిని వదిలేసినట్లేనా..?



అనంతపురం సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ పరిధిలో జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన అక్రమాలకు బాధ్యుల్ని చేస్తూ.. 19 మంది ఉద్యోగులపై గృహ నిర్మాణ శాఖ ఎండీ రాజబాబు గత నెల మొదటి వారంలో చర్యలు తీసుకున్నారు. రూ.2.08 కోట్ల బిల్లులు అక్రమంగా చేసినట్లు గుర్తించి, రెగ్యులర్ ఉద్యోగులైన డీఈఈ క్రిష్టారావు, ఏఈ వినోద్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. రిటైర్డు డీఈఈ మహబూబ్‌బాషా, ఏఈలు రామ్మూర్తి, జమీల్ అహమ్మద్, కొండా భూషన్, శ్రీనివాసులుపై చార్జెస్ ఫ్రేమ్ చేశారు. మిగిలిన వారిలో ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఏఈలు, పది మంది సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ఉన్నారు. వారిపై చర్యలు తీసుకోవా లని అప్పట్లో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అదేశాలు జారీ చేశారు. నెల గడిచినా ఆదేశాలు అమలు కాకపోవడం విమర్శలకు తావిస్తోంది. చార్జెస్ ఫ్రేమ్ చేయడం, లేదా షోకాజ్ నోటీసులు ఇవ్వడం.. ఏదో ఒకటైనా చేయాలి కదా అని చర్చించుకుంటున్నారు.

ఎందుకో జాప్యం..!

అక్రమాలకు పాల్పడినవారిలో ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఏఈలు ఉన్నారు. వారిని ఉద్యోగాల నుంచి తొలగించి, కాజేసిన సొమ్మును రీకవరీ చేయాలని ఆ శాఖ ఎండీని కలెక్టర్ ఆదేశించారని తెలిసింది. రెండు వారాల క్రితం ఆ శాఖ పీడీని కూడా ఆదేశించారని సమాచారం. అయినా చర్యలు కనిపించడం లేదు. ఆ ఏఈలు ఎక్కడున్నారో కూడా తెలియని పరిస్థితి. వీరిలో ఒకరు కోర్టును ఆశ్రయించారని సమాచారం. మరొకరు కూడా ఇదే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిసింది. మిగిలిన పదిమంది ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లపై చర్యల గురించి హౌసింగ్, పీఆర్ అధికారులు ఆలోచించడం లేదు. రూ.కోట్లలో అక్రమాలు జరిగినట్లు గుర్తించినా.. చర్యల విషయంలో జాప్యం జరగడం అనుమానాలకు తావిస్తోంది. అక్రమాలలో భాగస్వాములైన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సచివాలయ ఉద్యోగులు కావడంతో షోకాజ్ నోటీసులు జారీ చేసి, సొమ్ము రీకవరీ చేస్తారని భావించారు. కానీ ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలూ కనిపించడం లేదు. అవుట్ సోర్సింగ్ ఏఈలు దరిదాపులలో కూడా కనిపించకుండా పోయారని ఆ శాఖ వర్గాలు అంటున్నాయి. చర్యలు ఆ ఏడుగురికే పరిమితమా..? మిగిలినవారిని వదిలేసినట్లేనా..? అనే చర్చలు జరుగుతున్నాయి. రూ.2.08 కోట్ల రీకవరీ గురించి పట్టించుకునే సూచనలు లేవనే అంటున్నారు.


కలెక్టర్‌కు నివేదిక..



జగనన్న ఇళ్లలో జరిగిన అక్రమాలకు సంబంధించి ఇద్దరు ఏఈలపై కలెక్టర్‌కు సమగ్ర నివేదిక పంపించాము. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ల విషయం మాకు తెలియదు. కొన్ని ఫైల్స్ లేకపోవడంతో చర్యల పరంగా ఆలస్యం జరుగుతోంది.

- శైలజ, జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ

మాకు ఆదేశాలు రాలేదు..



జగనన్న ఇళ్ల నిర్మాణంలో అక్రమాల విషయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లపై చర్యలు తీసుకోవాలని మాకు ఏలాంటి ఆదేశాలు జారీ కాలేదు. ఆదేశాలు వస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం.

- జహీర్ అస్లాం, పీఆర్ ఎస్ఈ

ఆదర్శమూర్తి పప్పూరు రామాచార్యులు

- తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి

అనంతపురం కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆదర్శమూర్తి పప్పూరు రామాచార్యులు అని తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి పేర్కొన్నారు. పప్పూరు రామాచార్యులు 128వ జయంతిని పురస్కరించుకుని ఆ సంస్థతోపాటు అనంతపురం సాహితీ మిత్రబృందం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా టీవీ రెడ్డి మాట్లాడుతూ పప్పూరు రామాచార్యులు కలగన్న శ్రీభాగ్ ఒప్పందం అమలయ్యేవరకూ సీమప్రజలు పోరాటం చేయాలని కోరారు. సీమప్రాంత ప్రయోజనాల కోసం నిలబడాలన్నారు. ఆయన అనంతపురం జిల్లా అభివృద్ధికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జాషువా సాహిత్యపీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య, అనంత సాహితీ ప్రస్థానం వ్యవస్థాపకుడు గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, విశాలాంధ్ర బుక్‌హౌస్ నిర్వాహకుడు చెట్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పప్పూరు రామాచార్యులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

చెలరేగిపోతున్న దొంగలు..!

- పట్టించుకోని పోలీసులు
- పొలాల్లో నిత్యం కేబుల్ వైర్ల చోరీ
- పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆవేదన



యాడికిలో కేబుల్‌వైరు కత్తిరించుకు వెళ్లిన దొంగలు

యాడికి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కేబుల్ వైరు దొంగలు పేట్రేగిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళల్లో వ్యవసాయ బోరు బావుల వద్ద ఉన్న కేబుల్ వైరును దొంగిలించుపోతున్నారు. యాడికి మండలంలోని పలుచోట్ల వారంరోజుల వ్యవధిలో 20 మంది రైతులకు చెందిన బోరుబావుల కేబుల్‌వైరు కత్తిరించుకు వెళ్లారు. దీంతో పంటలను కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని పోలీస్‌స్టేషన్‌కు వెళుతున్న రైతులకు చుక్కెదురవుతుండడంతో ఏం చేయాలో దిక్కుతెలియని పరిస్థితి నెలకొంది. రాయలచెరువులోని గుత్తా శ్రీనివాసులు అనే రైతుకు చెందిన అరటి తోటలో వారంలో మూడుసార్లు 120 మీటర్ల కేబుల్ వైరు చోరీ చేశారు. వేలూరు జగదీష్ అనే రైతుకు చెందిన తోటలో వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు వంద మీటర్ల కేబుల్‌వైరు దొంగలించారు. యాడికిలో శేఖర్ అనే రైతుకు చెందిన తోటలో 20 మీటర్ల కేబుల్‌వైరు, రాయలచెరువులో చిలమకూరు వెంకటనాయుడు తోటలో 30 మీటర్లు, ఈశ్వరయ్య తోటలో 20 మీటర్లు, వాసు తోటలో 40 మీటర్లు, చందన గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి తోటలో 20 మీటర్ల కేబుల్‌వైరును అపహరించారు. రాయలచెరువు, చందన గ్రామాల పరిధిలో ప్రతిరోజూ రాత్రివేళల్లో దొంగలుపడి బోరుబావుల వద్ద కేబుల్‌వైరు కత్తిరించుకు పోతుండడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఫిర్యాదు చేయడానికి వెళ్లినా ప్రయోజనం లేకుండా పోతుండడంతో చాలామంది రైతులు మిన్నకుండిపోతున్నారు. కేబుల్‌వైరు దొంగల దుశ్చర్యలతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దొంగలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

వారంలో మూడుసార్లు చోరీ



నా అరటితోటలో వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు కేబుల్‌వైరు దొంగతనం చేశారు. దొంగతనం జరిగిన ప్రతిసారి 40 మీటర్ల కొత్త కేబుల్‌వైరు తెచ్చి అమర్చుకుంటున్నాను. కేబుల్‌వైరు అమర్చుకోకపోతే నీరు లేక పంటలను ఎండబెట్టుకోవాల్సి వస్తుంది. 20 మంది రైతుల తోటల్లో కేబుల్‌వైరు చోరీ జరిగింది. రైతులందరం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పోలీసులు చర్యలు చేపట్టి కేబుల్ వైరు దొంగల ఆగడాలను అరికట్టాలి.

- గుత్తా శ్రీనివాసులు, రాయలచెరువు

చోరీలతో తీవ్ర ఇబ్బందులు



వారంరోజుల వ్యవధిలో నా అరటితోటలో రెండుసార్లు కేబుల్‌వైర్ల దొంగతనం జరిగింది. 100 మీటర్ల కేబుల్ వైరును దొంగలు ఎత్తుకెళ్లారు. పంటలను కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పగలంతా తోటల వద్దనే ఉండి పనులు చేసుకుంటాం. రాత్రివేళల్లో కూడా తోటల వద్దకు వెళ్లి దొంగలకు కాపలా ఉండాలంటే అయ్యేపనేనా. పోలీసులు తగు చర్యలు తీసుకొని దొంగల ఆగడాలను అరికట్టాలి.

- వేలూరు జగదీష్, రాయలచెరువు

అక్రమాలకు పెద్దన్న..!

- అప్పుడు.. ఇప్పుడు.. ఆయనదే హవా..!
- పది సెంట్ల స్థలం ఆక్రమణ
- ఆరు సెంట్లలో ఇంటి నిర్మాణం
- లెక్కలేనన్ని ఇతరుల ప్లాట్ల అమ్మకం
- మటన్ మార్కెట్‌లో ఇష్టారాజ్యం

అతను వైసీపీ నాయకుడు. రాష్ట్రంలో ఆయన పార్టీ అధికారం కోల్పోయినా ఇక్కడ ఆయన హవా ఎంత మాత్రం తగ్గలేదు. ఆయన చెప్పిందే వేదం. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆయన ఆగడాలకు అడ్డేలేకుండా పోయింది. ఆయన ఉంటున్న కాలనీలో అంత తన ఇష్టానుసారమే జరిగింది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేసి, అమ్మేశాడు. ఇటీవల కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో ఆయన కొంతమంది చోటా నాయకులతో కలిసి అధికార పార్టీ ప్రజాప్రతినిధి కుటుంబసభ్యుడిని కలిశాడు. దీంతో ఆయన హవా ఎప్పటిలానే సాగుతోంది. ఇది చూసిన వారంతా అప్పుడు.. ఇప్పుడు ఆయనదే హవా అనేస్తున్నారు. ఇదంతా జరుగుతోంది మరెక్కడో కాదు..రూరల్ మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ పరిధిలోని మటన్ మార్కెట్‌లోనే. - అనంతపురం రూరల్ (ఆంధ్రజ్యోతి)

ఆక్రమించి.. ఇల్లు కట్టేసి..

ఆ వైసీపీ నాయకుడు మటన్ మార్కెట్‌లోకి వచ్చినప్పుడు పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండేది. స్థానికంగా బాడుగ ఇంట్లో ఉంటూ పనులు చేసుకునేవాడు. అయితే అప్పటి ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల అండతో నాయకుడి అవతారం ఎత్తాడు. స్థానికులను బెదిరించాడు. టీడీపీ, ఇతరులకు కేటాయించిన స్థలాలను ఒక్కొక్కటిగా ఆక్రమించేశాడు. అలా పది సెంట్లు ఆక్రమించేశాడు. అందులోని ఆరు సెంట్లలో అన్ని హంగులతో పెద్ద ఇంటిని కూడా నిర్మించాడు. స్థానికంగా ఇతరులకు



చిన్నంపల్లి పంచాయతీలోని మటన్ మార్కెట్

కేటాయించిన స్థలాలు ఒక్కొక్కటిగా అమ్మేశాడు. ఇలా అమ్మిన ప్లాట్ల సంఖ్య పెద్దదిగానే ఉంది. ఒక్కో ఖాళీ స్థలాన్ని రూ.లక్ష మొదలుకుని రూ.3లక్షల వరకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఆ సొమ్మునే ఇంటి నిర్మాణానికి పెట్టుబడి పెట్టాడు. స్థానికంగా



ఇతరుల స్థలాలను ఆక్రమించి వైసీపీ నాయకుడు కట్టిన ఇల్లు

ఎవరైనా ఇళ్లు కట్టుకోవాలన్నా ఆయన అనుమతి తీసుకోవడంతోపాటు, మామూళ్లు ఇచ్చుకోవాల్సిందేననే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మారిన తరువాతైనా స్థానికంగా పరిస్థితి మారుతుందని అందరూ అనుకున్నారు. ప్రభుత్వం మారింది. అయినా ఆ నాయకుడి హవా మాత్రం తగ్గకపోవడంతో నిర్వేదం చెందుతున్నారు.

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ఇతరులకు సంబంధించి ప్లాట్లను ఇష్టారాజ్యంగా విక్రయించి సొమ్ము చేసుకున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోని పరిస్థితి. అటూ వైపు తొంగిచూసిన దాఖలాలే లేవు. దీనికి తోడు అప్పటి రెవెన్యూ ఉద్యోగులు ఆ నాయకుడికి బాగా సహకరించినట్లు సమాచారం. సాధారణంగా ఎవరికైనా సెంటు భూమి ఇవ్వాలంటే రెవెన్యూ అధికారులకు సవాలక్ష నిబంధనలు అడ్డొస్తాయి. అలాంటిది పది సెంట్లు ఇతరులకు ప్రభుత్వం కేటాయించగా ఆ స్థలాలను ఆక్రమించి ఇల్లు కట్టుకున్నా పట్టించుకోవడం లేదు. వైసీపీ అధికారం కోల్పోవడంతో ఆ నాయకుడి ఆగడాలకు అడ్డుకట్ట పడుతుంది అనుకుంటే లోపాయికారిగా అధికార పార్టీ నాయకుల అభయం పొంది యథావిధిగా తన పని చేసుకుపోతున్నట్లు సమాచారం.

నిబంధనలు అందరికీ ఒక్కటే..



రెవెన్యూ నిబంధనలు అందరికి ఒక్కటే. ఒక్కొక్కరికి ఒక్కోలా ఉండవు. వైసీపీ నాయకుడు ఆరు సెంట్లలో ఇల్లు కట్టుకున్నట్లు మా దృష్టికి వచ్చింది. పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటాం. భూ ఆక్రమణ విషయంలో ప్రస్తుతం ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకొస్తోంది. ఆ మేరకు చర్యలు తీసుకుంటాం.

- మోహన్‌కుమార్, తహసీల్దార్

న్యూస్ బాక్స్

నేడు పీఎం సూర్యఘర్ మేళా



సంపత్‌కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ

అనంతపురం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు వినియోగదారుల కోసం శనివారం ప్రధాన మంత్రి సూర్య ఘర్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలోని ఆవరణలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా సంబంధిత విద్యుత్తు అధికారులు, వెండర్లు, ఎస్‌బీఐ, యూనియన్, బ్యాంక్‌ఆఫ్‌బరోడా, ఇండియన్‌బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకుల అధికారులు వారి శాఖల వారిగా స్టాల్స్ ఏర్పాటు చేస్తారన్నారు. ఇంటి పై కప్పు మీద సోలార్ పలకల ఏర్పాటుకు సబ్సిడీతో రుణాలు ఇస్తారన్నారు. రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవడం వలన విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చునన్నారు. ఇంటి వినియోగానికి పోగా మిగులు కరెంటును విక్రయించుకునేందుకు వీలుంటుందన్నారు. వినియోగదారులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు జిల్లాస్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు ఈనెల 10న అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గురుస్వామి తెలిపారు. జిల్లా స్థాయి సబ్‌జూనియర్ తైక్వాండో బాల, బాలికల కేటగిరిలలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. 7-14 సంవత్సరాల మధ్య వయస్సు గల క్రీడాకారులు అర్హులన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 15 నుంచి ప్రకాశం జిల్లా కందుకూరులో నిర్వహించే 38వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు సెల్ నంబరు 9110556525ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ, పీడీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. ఈనెల 7న ఉంగుటూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్-14 బాల, బాలికల అథ్లెటిక్ పోటీల్లో జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం సాధించింది. బాలికల విభాగంలో జిల్లాకు చెందిన వర్షిత, సుప్రియ, స్ఫూర్తి, లిఖితారెడ్డి పతకాలు సాధించారు. బాలుర విభాగంలో మౌలాలీ, దిలీప్, సాయికిరణ్, రవితేజ, నవీన్‌కుమార్‌లు పతకాలు సాధించిన వారిలో ఉన్నారు. విజేతలను శుక్రవారం స్థానిక ఎస్‌జీఎఫ్ కార్యాలయంలో డీఈఓ ప్రసాద్ సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, పీడీలు వేణుగోపాల్, ప్రసాద్, చల్లా ఓబుళేసు, అథ్లెటిక్ కోచ్ చలపతి తదితరులు పాల్గొన్నారు.

1న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్-2024 పోటీలు డిసెంబరు 1న జిల్లా కేంద్రంలోని రామచంద్రనగర్ సెయింట్ అగస్టీన్స్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు అనంతపురం జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి రవిరాజు తెలిపారు. అండర్-8, 10, 12, 14 బాల, బాలికలకు కేటగిరిలలో పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొంటారన్నారు. వివరాలకు 9966333414 నంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు జేఎన్‌టీయూ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య

అనంతపురం సెంట్రల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు జేఎన్‌టీయూ విద్యార్థులు ఎంపికైనట్లు వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శారద తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య శుక్రవారం అభినందించారు. ఇన్‌చార్జ్ వీసీ మాట్లాడుతూ నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీలో పదిరోజులపాటు నిర్వహించే పరేడ్‌కు విద్యార్థులు వెంకటేష్ నాయక్, నందిత ఎంపికవడం అభినందనీయమన్నారు.

వైద్యసేవకే తొలి ప్రాధాన్యం

- వృత్తిని బాధ్యతగా నిర్వర్తించండి
- వర్క్‌షాపులను సద్వినియోగం చేసుకోవాలి
- చిన్నపిల్లల డాక్టర్ల వర్క్‌షాపులో కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 'నేను తొలుత డాక్టర్. ఇపుడు ఐఏఎస్ అధికారిని. అయినా నా తొలి ప్రాధాన్యం వైద్యానికే. నేను ఏస్థాయిలో ఉన్నా వైద్య సేవలు అందించడానికే ప్రాధాన్యం ఇస్తా' అని జిల్లా కలెక్టరు డాక్టరు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఐఎంఏహాల్‌లో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యంలో చిన్నపిల్లలడాక్టర్ల వర్క్‌షాపు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టరు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైద్య వృత్తికి, డాక్టర్‌కు సమాజంలో ఎంతో గౌరవం, గుర్తింపు ఉన్నాయన్నారు. అలాంటి డాక్టరు వృత్తిలో ఉన్న ప్రతిఒక్కరు బాధ్యతగా పని చేయాలని సూచించారు. ప్రైవేటు డాక్టర్లు నిబంధనలు పాటించి సేవలు అందించాలన్నారు. డాక్టర్ నిత్య విద్యార్థిగా ఉంటూ అధునాతన వైద్య విధానాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌లు జూనియర్ డాక్టర్లకు ఎంతో ప్రయోజనమన్నారు. వైద్యవృత్తిని సేవాభావంతో నిర్వహిస్తూ పేదప్రజలకు వైద్యసేవలు అందించినపుడే డాక్టర్లకు ఆత్మసంతృప్తితోపాటు కీర్తిప్రతిష్టలు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్

వస్తాయని పేర్కొన్నారు. వైద్య కళాశాల, కిమ్స్‌సవీరా, కేర్‌అండ్‌క్యూర్, జిల్లాఆస్పత్రులలోను ఈవర్క్‌షాప్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ఐఎంఏరాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అనిల్‌కుమార్, రాష్ట్రకార్యదర్శి డాక్టర్ ఏఎస్‌కిరీటీ, జీజీహెచ్ పీడియాట్రిక్ హెచ్ఓడీ డాక్టర్ రవికుమార్, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ శ్రీకాంత్, బెంగళూరు డాక్టర్ ప్రతాప్‌చంద్ర, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత పలువురు పీడియాట్రిక్స్ డాక్టర్లు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- గుంతల రోడ్లకు మరమ్మతులు
- చకచకా సాగుతున్న ప్యాచ్ వర్కులు
- వైసీపీ పాలనలో సర్వం ఛిద్రం



తారుతో ప్యాచ్‌లు వేస్తున్న దృశ్యం

కనగానపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో గుంతల రోడ్లకు మోక్షం లభిస్తోంది. ఐదేళ్ల పాలనలో రోడ్ల మరమ్మతులకు వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కనీసం ప్యాచ్ వర్కులకు కూడా నిధులు మంజూరు చేయలేదు. దీంతో రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎంతోమంది ప్రమాదాలకు గురయ్యారు. అయితే ఇటీవల అధికార పీఠంపై కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ప్రజలు పడుతున్న ప్రయాణ ఇబ్బందులు తీర్చడానికి పూనుకుంది. మొదట గుంతలకు ప్యాచ్ వర్కులు చేపట్టింది. రోడ్డుకు ఇరు వైపులా పెరిగిన కంపచెట్లు తొలగించే పనులు చేపట్టింది. రాప్తాడు నియోజకవర్గంలో కనగానపల్లి, అనంతపురం సెక్షన్ కింద 11 రోడ్లను గుర్తించింది. ఇందుకు రూ.2.84 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో ప్యాచ్ వర్కులు చక చకా జరుగుతున్నాయి. గుంతల రోడ్లపై ప్రయాణించాలంటే భయంగా



కంకర తేలి అధ్వానంగా ఉన్న కనగానపల్లి-మామిళ్లపల్లి రోడ్డు

ఉండేదని, ప్రభుత్వం రోడ్లకు మరమ్మతులు చేయడం వల్ల ప్రమాదాలు తగ్గుతాయని పలువురు వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కనగానపల్లి సెక్షన్ రోడ్లు: కనగానపల్లి-చిగరచెట్టు, ఆత్మకూరు-కురాకులపల్లి, ఎన్. ఎస్‌గేటు-ధర్మవరం, ఎగువపల్లి-తగరకుంట, మామిళ్లపల్లి-భానుకోట

అనంతపురం సెక్షన్: అనంతపురం-తగరకుంట, సింగంపల్లి మెయిన్ రోడ్డు, మరూరు-రామినేపల్లి, ఈనాడు ఆఫీస్-చిగిచెర్ల, బొమ్మేపర్తి రోడ్లకు మరమ్మతులు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



గుంతల రోడ్లపై కంకర, వెట్ మిక్స్ వేస్తున్న కూలీలు

ప్రమాదాలు తగ్గుతాయి



దెబ్బతిన్న రోడ్లను బాగు చేయడం మంచిది. వర్షాకాలంలో గుంతల్లో నీళ్లు నిలబడటంతో లోతు తెలియక అందులో దిగిన వాహనదారులు చాలా మంది కిందపడి గాయపడ్డారు. కొందరు చనిపోయారు. రోడ్లు మరమ్మతులు చేయడం వలన చాలా వరకూ ప్రమాదాలు తగ్గుతాయి. ఇందుకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునితకు కృతజ్ఞతలు.

- మనోహరనాయుడు, తల్లిమడుగుల

పనుల వేగవంతానికి కృషి

దెబ్బతిన్న రోడ్లకు ప్యాచ్ వర్క్ అవసరమున్న చోట లెంతీ పనులు చేస్తున్నాం. పనులు నాణ్యతగా, వేగంగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం. మరమ్మతు పనులే గాక మరిన్ని రోడ్లకు ప్రతిపాదనలు పంపాం.

- హరిక, ఆర్అండ్‌బీ జేఈ

పప్పుశనగకు వేరుకుళ్లు..!

- నిలువునా ఎండిపోతున్న పంట
- ఆందోళనలో రైతులు



తెగులుతో ఎండిన పప్పుశనగ

యాడికి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రబీలో సాగుచేసిన పప్పుశనగ పంట వేరుకుళ్లు తెగులుతో నిలువునా ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. యాడికి మండలంలోని ఎన్.కొత్తపల్లి, వేములపాడు, నగరూరు, భోగాలకట్ట, కొట్టాలపల్లి తదితర గ్రామాల్లో సుమారు 2,500 హెక్టార్లలో పప్పుశనగ పంట సాగు చేశారు. వేరుకుళ్లు తెగులు మొదట పంటలో అక్కడక్కడ కనిపిస్తోందని రైతులు తెలిపారు. తెగులు సోకిన మొక్కలను తొలగిస్తున్నా పొలమంతా వ్యాప్తి



వేరుకుళ్లు తెగులు సోకిన పప్పుశనగ పంట

చెందుతోందని దీంతో పంటంతా దెబ్బతింటున్నదని తెలిపారు. మందులు పిచికారి చేసినా తెగులు ఉధృతి తగ్గడం లేదన్నారు. తెగులు ప్రభావం ఇలాగే కొనసాగితే రబీలో సాగుచేసిన పప్పుశనగ పంట దిగుబడి కష్టమే అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు పంటను పరిశీలించి తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలను సూచించాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నట్లుండి పంట ఎండుతోంది



పప్పుశనగ పంటలో మొక్కలు ఉన్నట్లుండి ఎండిపోతున్నాయి. మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేదు. సాగుచేసిన పంటలో 40 శాతం పైగా మొక్కలు ఇలా ఎండిపోతున్నాయి. విత్తు సమయంలో విత్తనశుద్ధిచేసినా ప్రయోజనం లేకుండా పోయింది. వ్యవసాయశాఖ అధికారులు పంట పొలాలను పరిశీలించి తెగుళ్ల నివారణకు సలహాలు అందించాలి.

- జగదీష్, ఎన్.కొత్తపల్లి

అదుపులోకి రాని తెగులు



రబీలో ముందుగా సాగుచేసిన పప్పుశనగ పంటలో వేరుకుళ్లు తెగులు ఎక్కువగా ఉంది. మొదట పంటలో అక్కడక్కడ తెగులు కనిపించింది. అనంతరం పంట మొత్తం వ్యాప్తి చెందుతోంది. ఎన్నిమందులు పిచికారి చేసినా వేరుకుళ్లు తెగులు అదుపులోకి రావడంలేదు. తెగులు ప్రభావం ఇలాగే ఉంటే పంటను కోల్పోవాల్సి వస్తుంది.

- నాగమల్లేష్, ఎన్.కొత్తపల్లి

కేజీబీవీ పోస్టుల భర్తీలో అన్యాయం

- బాధిత అభ్యర్థుల ఆవేదన



బాధితులు మాధవి, కళావతి

అనంతపురం విద్య, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పోస్టుల భర్తీలో రోస్టర్ మార్చి, తమకు అన్యాయం చేశారని పలువురు అభ్యర్థులు వాపోయారు. సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో కేజీబీవీల్లో ఖాళీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం పోస్టింగ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నోటిఫికేషన్‌లో పీజీటీ ఎంపీహెచ్‌డబ్ల్యూ పోస్టు ఓపెన్ కేటగిరీలో చూపించి, భర్తీ సమయంలో బీసీ కేటగిరీ అభ్యర్థికి అవకాశం కల్పించారని అభ్యర్థి మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. రోస్టర్ అమలు చేయడంలో అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆమె అసహనం వ్యక్తం చేశారు. మరో అభ్యర్థి కళావతి మాట్లాడుతూ పీజీటీ- పీఎస్‌టీటీ ఒకేషనల్ పోస్టులు రెండింటిలో ఒకటి ఓసీ రోస్టర్‌కు, మరొకటి ఎస్సీ రోస్టర్ ఉండగా... ఓసీ రోస్టర్ అభ్యర్థులతోనే భర్తీచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఈ విషయాలను సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులను అడిగితే ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు భర్తీ చేయగా ఆగిపోయిన తర్వాత రోస్టర్ ఆధారంగా పోస్టులు భర్తీ చేశామని చెప్పి తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని జిల్లా కలెక్టర్, విద్యాశాఖ మంత్రికి దృష్టికి సైతం తీసుకెళ్తామని తెలిపారు.

అనంతపురం మీదుగా ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ఏర్పడిన ప్రయాణికుల రద్దీ నియంత్రణకు రైల్వే శాఖ అనంతపురం మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. బెంగళూరు-బరౌనీ ప్రత్యేక రైలు (నం. 06563)ను ఈ నెల 12, 19 తేదీల్లో బెంగళూరులో రాత్రి 9-15 గంటలకు బయలుదేరి రెండు రోజుల తర్వాత 14, 21 తేదీలలో రాత్రి 8 గంటలకు బరౌనీకి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06564) ఈ నెల 15, 22 తేదీలలో సాయంత్రం 5 గంటలకు బరౌనీలో బయలుదేరి 17, 24 తేదీలలో సాయంత్రం 6 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హంక, ధర్మవరం, అనంతపురం, డోన్, కర్నూల్ సిటీ, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజీపేట, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, జబల్పూర్, కట్నీ, శాట్నా, ప్రయాగరాజ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, బక్సర్, ఆర, దానాపూర్, పాటలీపుత్ర, హాజీపూర్, బచ్‌వారా స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందన్నారు. యశ్వంతపూర్-ముజఫర్ నగర్ ప్రత్యేక రైలు (నం 06229) ఈ నెల 13న యశ్వంతపూర్‌లో ఉదయం ఏడున్నరకు బయలుదేరి 15న ఉదయం 9-45 గంటలకు ముజఫర్‌నగర్‌కు చేరుతుందని, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06230) ఈ నెల 16న ఉదయం 10-45 గంటలకు ముజఫర్‌నగర్‌లో బయలుదేరి 18న ఉదయం 10-50 గంటలకు యశ్వంతపూర్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు ధర్మవరం, అనంతపురం, డోన్, కర్నూలు సిటీ, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజీపేట, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, జబల్పూర్, కట్నీ, శాట్నా, ప్రయాగరాజ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, బక్సర్, ఆర, దానాపూర్, పాటలీపుత్ర, హాజీపూర్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

ధర్మవరం మీదుగా..

యశ్వంతపూర్-దానాపూర్ ప్రత్యేక రైలు (నం 06271) ఈ నెల 14, 21 తేదీల్లో (గురువారాలలో) ఉదయం ఏడున్నరకు యశ్వంతపూర్‌లో బయలుదేరి 16, 23 తేదీలలో (శనివారాలు) ఉదయం 6 గంటలకు దానాపూర్‌కు చేరుకుంటుందని, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06272) ఈ నెల 17, 24 తేదీలలో (ఆదివారాలలో) ఉదయం 8 గంటలకు దానాపూర్‌లో బయలుదేరి 19, 26 తేదీలలో (మంగళవారాలలో) ఉదయం పదిన్నరకు యశ్వంతపూర్‌కు చేరుకుంటాయని వివరించారు. ఈ రైలు ధర్మవరం, డోన్, కర్నూలు సిటీ, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజీపేట, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, జబల్పూర్, కట్నీ, శాట్నా, ప్రయాగరాజ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, బక్సర్, ఆర స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు

గుత్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు, గుత్తి ఆర్ఎస్ ప్రాంతానికి చెందిన తనను సూరసింగన్నపల్లి కాలనీకి చెందిన గోవర్ధన్ తరచూ వేధిస్తున్నాడని ఆ మహిళ ఈనెల 5న పోలీసులకు ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న గోవర్ధన్ ఇంటి నుంచి పరారయ్యాడు. అనంతపురంలో బంధువుల ఇంట్లో తలదాచుకున్నట్లు తెలుసుకున్న పోలీసులు గోవర్ధన్‌ను అదుపులోకి తీసుకుని గుత్తిపోలీస్ స్టేషన్‌కు తరలించారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మొక్కేకదా అని వదిలేస్తే..



ఎస్కేయూ వద్ద హైవే బ్రిడ్జిపై పెరుగుతున్న రావి చెట్టు

అనంతపురం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇక్కడ కనిపించే రావి మొక్క చూడటానికి బాగానే ఉంది. కానీ అది పెరిగే కొద్ది ప్రమాద అవకాశం కూడా ఎక్కువ అవుతుంది. ఎందుకంటే అది ఎక్కడో మైదానంలో పెరగడం లేదు. ఎస్కేయూ వద్ద ఉన్న అనంతపురం-కదిరి హైవే బ్రిడ్జికి ఏర్పాటు చేసిన దిమ్మెల మధ్య పెరుగుతోంది. ఈ మొక్క చెట్టుగా ఎదిగే క్రమంలో దాని వేర్లు బ్రిడ్జిలోకి పంపుతుంది. దీంతో బ్రిడ్జి దెబ్బతినే ప్రమాదం ఉంది. జాతీయ రహదారుల పర్యవేక్షణ అధికారులు పట్టించుకోకపోవడంతోనే పలు చోట్ల ఇలా మొక్కలు పెరుగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.

న్యూస్‌బాక్స్

వైభవంగా దీపోత్సవం



దీపోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ

ధర్మవరంరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇస్కాన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్‌లో శుక్రవారం కార్తీక దామోదర దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని చిత్రపటాన్ని ఏర్పాటు చేసి దీపాలు వెలిగించారు. ప్రజలంతా దీపాలు వెలిగించి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం హరేకృష్ణ నామమంత్రాన్ని జపించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఇస్కాన్ ధర్మప్రచారకుడు శ్రీకృష్ణమాధవదాస్, ఇస్కాన్ భక్తులు పాల్గొన్నారు.

డీఎస్సీ శిక్షణ పరీక్ష వాయిదా

అనంతపురం ప్రెస్‌క్లబ్/ పుట్టపర్తిరూరల్, నవంబరు 8: ఉచిత డీఎస్సీ శిక్షణ పరీక్ష వాయిదా వేసినట్లు ఎస్సీ సంక్షేమశాఖ అనంతపురం జిల్లా డీడీ కుష్బూకొఠారీ, శ్రీసత్యసాయి జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి శివరంగప్రసాద్ శుక్రవారం వేరువేరు ప్రకటనల్లో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు గమనించాలని, త్వరలోనే పరీక్ష తేదీని ప్రకటిస్తామన్నారు.

తెగుళ్లను నివారించుకోండి

జిల్లా వనరుల కేంద్రం ఏడీ సనావుల్లా

ధర్మవరంరూరల్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా వరి, కంది పంటలకు తెగుళ్ల సోకాయనీ, వీటి నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకుడు (ఏడీ) సనావుల్లా తెలిపారు. మండలంలోని చిగిచెర్ల గ్రామ సమీపాన వరి, కంది, ఆముదం పంటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఏడీ సనావుల్లా మాట్లాడుతూ.. ప్రస్తుతం కంది పంటను కాయ తొలుచు పురుగు ఆశించిందన్నారు. దీని నివారణకు స్పైనోసాడ్ 60 ఎం.ఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలన్నారు. వరి పంటకు దోమపోటు సోకిందని పెక్సీలాన్ 94 ఎం.ఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలన్నారు. ఆముదం పంటలో బూజుతెగుళ్ల నివారణకు 1 ఎంఎల్ ప్రోపికోనజల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. రబీలో సాగుచేసిన వేరుశనగ పంట మొదటి దశలో వేపనూనెకు నీరు కలిపి పిచికారీ చేసుకుంటే ఆదిలోనే తెగుళ్లను నివారించవచ్చన్నారు. పూతదశలో ఉన్న వేరుశనగకు 200 కిలోల జిప్సం వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ కృష్ణయ్య, ఏఓ ముస్తఫా, డీఆర్‌సీ ఏఓ అబ్దుల్‌అలీ, రైతులు పాల్గొన్నారు.

క్రైంకార్నర్

చోరీ కేసులో నలుగురి అరెస్టు

రూ.2.20 లక్షలు, కత్తులు, స్కూటీ స్వాధీనం

కదిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : స్థానిక అడపాలవీధిలో నివాసముంటున్న అత్తార్ లాడ్జి మేనేజర్ నారాయణస్వామి ఇంట్లో చోరీకి పాల్పడిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.2.20 లక్షల నగదు, కత్తులు, ఇనుప రాడ్లు, స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శుక్రవారం ఆయన తెలిపిన సమాచారం మేరకు.. తన ఇంట్లో రూ.3.50 లక్షలు చోరీ అయినట్లు నారాయణస్వామి గతనెల 18న కదిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించారు. నారాయణస్వామి ఇంటి పైభాగంలో అద్దెకు ఉంటున్న ఇద్దరు వ్యక్తులు.. మరో ఇద్దరు వ్యక్తులు ఈ చోరీ చేసినట్లు గుర్తించారు. వారిని సల్మాన్‌ఖాన్, మక్బూద్ మహమ్మద్‌ఖాన్, ఫారూక్ అబ్దుల, తోకల శ్రీకాంత్‌రెడ్డిగా గుర్తించారు. గురువారం కదిరి, హిందూపురం ప్రధాన రహదారి గట్టు వద్ద వారు ఉండగా.. అరెస్టు చేసి.. రిమాండ్‌కు తరలించారు. నిందితులను అరెస్ట్ చేసిన ఎస్ఐ బాబ్‌జాన్, హెడ్‌కానిస్టేబుల్ జాకీర్ హుస్సేన్, కానిస్టేబుల్ శంకర్‌రెడ్డి, రాజప్పను డీఎస్పీ అభినందించారు.

నగదు స్వాహాపై కేసు

గాండ్లపెంట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్డీటీ ఓకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో అకౌంటెంట్ నాగరాజు రూ. 21 లక్షల అవినీతి పాల్పడినట్లు ఆ సెంటర్ లీడర్ పద్మావతమ్మ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు... గాండ్లపెంట ఆర్డీటీ కార్యాలయంలో మహిళలకు వృత్తి శిక్షణలో భాగంగా బుక్‌బైండింగ్ వర్క్ చేసేవారు. సరుకు నిమిత్తం రూ.21 లక్షలకు చెందిన ఖాళీ చెక్కులపై ఓకేషనల్ మహిళ లీడర్లతో నాగరాజు సంతకాలు చేయించుకున్నారు. విజయవాడకు చెందిన జోగులాంబ ట్రేడర్స్ ప్రొప్రైటర్‌లో అతను కుమ్మక్కై సరుకు రాకుండానే చెక్కులను మార్చుకున్నారు. దీనిపై పద్మావతమ్మ ఫిర్యాదు చేయడంతో.. ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రంగా తెలిపారు.

ఎదురుచూపులు..!

- చేనేత సహకార సంఘాల ఎన్నికలు ఎప్పుడో...?
- పదకొండేళ్ల తర్వాత నిర్వహణకు చర్యలు
- డిసెంబరు 4న ఎన్నికలు అంటూ షెడ్యూల్
- అనివార్య కారణాలతో మళ్లీ వాయిదా?



మగ్గం నేస్తున్న చేనేత కార్మికురాలు

చేనేత సహకార సంఘాల ఎన్నికల కోసం నేతన్నలకు ఎదురు చూపులు తప్పట్లేదు. 11 ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఎన్నికలకు చర్యలు మొదలెట్టింది. చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి గతనెల 10న ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. డిసెంబరు 4న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. దీంతో చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఆ మేరకు జిల్లా క్షేత్రస్థాయి అధికారులు చేనేత కార్మికులతో సమావేశాలు సైతం నిర్వహించారు. కొత్తగా చేనేత సంఘాల్లో చేరేందుకు సభ్యులకు అవకాశం సైతం కల్పించారు. ఇటీవల అమరావతిలో నిర్వహించిన సమావేశంలో మంత్రి సవిత త్వరలోనే ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇంతవరకు ఎటువంటి షెడ్యూల్ విడుదల కాలేదని ఉమ్మడి జిల్లా చేనేత సహకార అధికారులు పేర్కొంటున్నారు.

-ధర్మవరం, ఆంధ్రజ్యోతి

ఎన్నెన్నో కారణాలు..

సహకార సంఘాల ఎన్నికలు వాయిదా పడడానికి అనేక కారణాలున్నాయని కార్మికసంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం కింద చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24వేలు చొప్పున అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ పథకాన్ని కొనసాగించడంతోపాటు కార్మికులకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని ప్రకటించారు. ఈ రెండు పథకాలను అమలు చేయాల్సి ఉంది. దీంతో ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే ఆ ప్రభావం ఉంటుందన్న వాదనను ఆ పార్టీ నాయకులే వ్యక్తం చేస్తున్నారు. ఉచిత విద్యుత్ క్షేత్రస్థాయిలో కసరత్తులకే పరిమితమైంది.

వైసీపీ పాలనలో ఎన్నికల ఊసేలేదు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 12న చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికైన పాలకవర్గాలు రాష్ట్ర విభజన అనంతరం 2018 వరకు కొనసాగాయి. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం మరో ఏడాది వారి పదవీకాలాన్ని పొడిగించింది. అనంతరం రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చేనేత సహకార సంఘాలకు, కార్మికులకు అందించే అన్ని సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం తుంగలో తొక్కి రాయితీలన్నింటినీ ఎత్తేసింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచన కూడా చేయలేదు. కేవలం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతోనే సంఘాలను నడిపించేశారు.

కూటమి పాలనలో...

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే చేనేత సహకార ఎన్నికలకు చర్యలు మొదలెట్టారు. అందులో భాగంగానే షెడ్యూల్ కూడా విడుదల చేశారు. అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు తెలిసింది. 2025 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని చేనేత కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రస్తుతానికి వాయిదా పడటంతో షెడ్యూల్ విడుదలైన తరువాత చేనేత సంఘాల్లో సభ్యులుగా చేరేవారికి అవకాశం కల్పిస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అధికారులే చేనేత సంఘాలను నిర్వహిస్తున్నారు. పలు సంఘాల్లో ఓవైపు వస్త్రనిల్వలు పేరుకుపోతుండగా.. మరోవైపు చేనేత ముడిసరుకులైన నూలు కట్టలుగా ఉన్నా.. నేసేందుకు కార్మికులు ముందుకురాని దుస్థితి నెలకొందని సమాచారం. ఇప్పటికైనా కార్మికులందరికీ ఉపాధి కల్పించేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు చేనేత కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.



నేతన్నలకే మేలు

చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహిస్తే నేతన్నలకు మేలు చేకూరుతుంది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎన్నికలే నిర్వహించలేదు. దీంతో నేతన్నలకు నష్టం వాటిల్లింది. చేనేత కార్మికులందరికీ ఉపాధి కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- వెంకటనారాయణ, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉత్తర్వులు అందలేదు

చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహణపై ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందలేదు. డిసెంబరులో ఎన్నికలు ఉంటాయని మౌఖికంగా తెలిపారు. నోటిఫికేషన్ తరువాత స్పష్టత వస్తుంది.

- రామకృష్ణ, ఏడీ, చేనేత జౌళిశాఖ



సీలు లేకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయిన కోడిగుడ్లు

గుడ్డుపై సీలు మాయం..!

- అంగన్‌వాడీలకు కోడిగుడ్ల సరఫరాలో నిబంధనలకు నీళ్లు
- సీలు లేకుండానే పంపిణీ...
- నాలుగు నెలలుగా ఇదే తంతు
- పక్కదారి పట్టే అవకాశం...
- చోద్యంచూస్తున్న అధికారులు



అంగన్‌వాడీలకు కోడిగుడ్ల సరఫరాలో నిబంధనలకు నీళ్లొదిలారు. సీలు లేకుండానే గుడ్లను సరఫరా చేస్తున్నారు. నాలుగు నెలలుగా ఇదే తంతు సాగుతోంది. తద్వారా నాణ్యతలేని, కాలంచెల్లిన గుడ్లను సరఫరా చేసే ప్రమాదం ఉంది. అలాగే కోడిగుడ్లు పక్కదారి పట్టే అవకాశం కూడా లేకపోలేదు. ఈ తంతు యథేచ్ఛగా సాగుతున్నా.. ఉన్నతాధికారులు చోద్యం చూస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

- హిందూపురం అర్బన్ (ఆంధ్రజ్యోతి)

నాలుగు నెలలుగా..

ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశాయి. వాటి ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నాయి. కోడిగుడ్లు, పాలు, దినుసులు సరఫరా చేస్తున్నాయి. గతంలో అంగన్‌వాడీలకు సరఫరా చేసే కోడిగుడ్లు పక్కదారి పట్టేవి. కాంట్రాక్టర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, అంగన్‌వాడీ సిబ్బంది సైతం అవకతవకలకు పాల్పడేవారు. ఒక్కోసారి పాత స్టాక్‌ను సరఫరా చేసేవారు. అందులో కుళ్లిన కోడుగుడ్లు ఎక్కువగా వచ్చేవి. ఏది కొత్త స్టాకో, ఏది పాతదో తెలిసేది కాదు. దీంతో గత టీడీపీ హయాంలో నూతన విధానాన్ని ప్రవేశ పెట్టారు. కోడిగుడ్లపై రంగులు వేసి, సరఫరా చేయాలని నిర్ణయించారు. అది కూడా 4 రకాల రంగులు వేసేవారు. నీలం, ఎరుపు, ఆకుపచ్చ, పర్పుల్ కలర్‌లో నాలుగు స్పెల్‌లలో కోడిగుడ్లు సరఫరా చేసేవారు. ఒకసారి వచ్చిన రంగు మళ్లీ సరఫరా అవడానికి కనీసం నెల రోజులు పట్టేది. దీంతో ప్రతి 15 రోజులకోసారి ఫ్రెష్‌గా కోడిగుడ్లు సెంటర్లకు అందేవి. ఆ పద్ధతి అలానే కొనసాగుతూ వస్తోంది. పక్కదారి పట్టించే అవకాశం కూడా ఉండేది కాదు. సీలును చూసి, గుర్తుపట్టేస్తారు కాబట్టి, కాంట్రాక్టర్లు ఆ ఆలోచన కూడా చేసేవారు కాదు. నాలుగు నెలలుగా కాంట్రాక్టర్లు, సరఫరాదారులు మారడంతో కోడిగుడ్డుపై సీలు మాయం చేశారు. సీలు లేకుండానే సరఫరా చేస్తున్నారు. విషయాన్ని అంగన్‌వాడీలు.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సీలు లేకపోతే కోడిగుడ్లు పక్కదారి పట్టే అవకాశం ఉంది. కాలం చెల్లినవి, నాణ్యత లేనివి సరఫరా చేసే ప్రమాదం లేకపోలేదు. సీలు లేకపోతే ఒకేసారి అధిక మొత్తంలో కోడిగుడ్లు సరఫరా చేసే అవకాశం ఉంది. తద్వారా రవాణా చార్జీల భారం తగ్గించుకునేందుకు కాంట్రాక్టర్లు ప్రయత్నిస్తున్నారు. ఎక్కువ రోజులు వాటిని నిలువ ఉంచితే చెడిపోయే అవకాశం ఉంది. వాటిని తింటే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది.

ట్రాన్స్‌పోర్టర్‌కు చెప్పాం..

సీలులేని కోడిగుడ్ల సరఫరాపై ఫిర్యాదు అందగానే కాంట్రాక్టర్, ట్రాన్స్‌పోర్టర్‌తో మాట్లాడాం. సీలు వేసి పంపాలని సూచించాం. ట్రాన్స్‌పోర్టర్ సమయం లేకపోవడంతో సీలులేకుండా పంపామని చెప్పాడు. అందుకు కొంతశాతం బిల్లులో కోత విధిస్తాం. అప్పటికీ అలాగే వ్యవహరిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, చర్యలు తీసుకుంటాం.

- నాగమల్లీశ్వరి, పీడీ, ఐసీడీఎస్

టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.16, కనిష్ఠ ధర రూ.10 పలికినట్లు ఆయన తెలిపారు.

బావిలో రైతుకూలీ గల్లంతు



రామాంజనేయులు (ఫైల్)



వివరాలు తెలుసుకుంటున్న పరిటాల సునీత

ధర్మవరంరూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టకిందపల్లి వ్యవసాయ కూలి పనులకు వచ్చిన దాసరి రామాంజనేయులు ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. అతడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కనగానపల్లి మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన దాసరి రామాంజనేయులు వ్యవసాయ కూలి పనులకు వెళ్తుంటాడు. కట్టకిందపల్లికి చెందిన రైతు ఈడిగ వెంకటరాముడు పొలంలో సాగునీటి బావిలో మరమ్మతులకు లోనైన మోటారును బయటకు తీసేందుకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం మరొకరితో కలిసి మోటారును వెలికితీసేందుకు బావిలోకి దిగాడు. ఎంత సేపటికీ రామాంజనేయులు రాకపోవడంతో అక్కడున్న వారు వెంటనే గ్రామస్థులు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం అతడి కుటుంబసభ్యులు, గ్రామస్థులు.. బావిలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేదు. ధర్మవరం రూరల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బావి వదకుఉ చేరుకుని, గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత బావివద్దకు చేరుకున్నారు. గాలింపు చర్యలను ముమ్మరం చేయించారు. బావిలో పెద్దపెద్ద చెట్లు ఉండటంతో పరిటాల సునీత అప్పటికప్పుడు ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను తెప్పించి, బావిలోని చెట్లను తొలగింపజేశారు. స్థానిక టీడీపీ నాయకులు పిలిపించి, బావిలోని నీటిని తోడేందుకు మోటార్లను తెప్పించారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఆర్డీఓ మహేశ్ మరికొన్ని మోటార్లను తెప్పించి, నీటిని తోడే చర్యలు ముమ్మరం చేశారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రిజిస్ట్రార్ రమేష్‌బాబు, కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్

గుంతకల్లుటౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పట్టణంలోని శ్రీ శంకరానంద గిరిస్వామి డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ కేసీ హరి కుమార్ సూచించారు. కళాశాలలో శుక్రవారం ఎస్కే యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ పురుషుల గ్రూప్ సీ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా కేసీ హరికుమార్, ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రెటరీ జెస్సీ, కళాశాల చైర్మన్ మురళీకృష్ణ హాజరయ్యారు. ఖోఖో, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని 13 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా జాతీయ జెండా, స్పోర్ట్స్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసిక ఉత్తేజాన్ని కలగజేస్తాయని, క్రీడలు జీవితంలో భాగం కావాలన్నారు. అనంతరం ఖోఖో, హ్యాండ్‌బాల్, పోటీలను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ పీ గోపాల్, ప్రిన్సిపాల్ కే వెంకటేశ్వర్లు, పీడీ మహబుబ్ బాషా, వర్సిటీ అనుబంధ కళాశాల పీడీలు, పీఈటీలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగల అరెస్టు

రిమాండ్‌కు తరలింపు... 25 బైక్‌ల స్వాధీనం



అరెస్టు చేసిన బైక్‌దొంగలతో సీఐ తదితరులు

ఎర్రగుంట్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మోటార్ బైక్‌లను దొంగతనం చేస్తూ వాహన దారులకు, పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్న నలుగురు అంతర్‌రాష్ట్ర దొంగలను వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సీఐ నరేష్‌బాబు కథనం మేరకు... నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ఉమ్మాయిపల్లెకు చెందిన మొలక గురివిరెడ్డి, బొడ్డుబోయిన నాగేష్, అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన షేక్ చిన్న హాజీబాష, పెద్దపప్పూరుకు చెందిన షేక్ ఇమాం హుస్సేన్‌లు చెడు అలవాట్లకు, విలాసాలకు అలవాటుపడి బైక్ దొంగత నాలకు పాల్పడేవారు. ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, గుత్తి, గుంతకల్, డోన్, విజయవాడ, ధర్మవరం, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఖరీదైన మోటార్ బైక్‌లను చోరీ చేసే వారు. ఈనేపథ్యంలో నిందితులు ఎర్రగుంట్ల మండలంలోని పొద్దుటూరు రోడ్డు రామాంజనేయపురం క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా ఉండ గా అదుపులోకి తీసుకుని.. విచారించగా మొత్తం వ్యవహారం బయట పడిందని సీఐ తెలిపారు. వీరి వద్ద నుంచి 25 మోటార్ బైక్‌లను స్వాధీ నం చేసుకున్నామమని.. వీటి విలువ సుమారు రూ.25లక్షలు ఉంటుందని తెలిపారు. బైకు దొంగలను పట్టుకోవడంలో కృషి చేసిన ఎర్రగుంట్ల సీఐ పి.నరేష్ బాబు, ఎస్ఐ నాగమురళి, ఏఎస్ఐ గురుశంకర్, హెడ్‌కాని స్టేబుల్ ఆల్‌ఫ్రెడ్, పోలీసు సిబ్బందిని ఎస్పీ, జమ్మలమడుగు డీఎస్పీలు అభినందించారు.

ప్రైవేటుకు దీటుగా ఆప్కో షాపులు

- రాష్ట్రంలో వంద ఏర్పాటు చేస్తాం
- ఉద్యోగులు వారంలో ఒకరోజు చేనేత వస్త్రాలు ధరించాలి: మంత్రి సవిత



ఆప్కో షాపులో చీరలను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

పుట్టపర్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వ్యాపార సంస్థలకు దీటుగా ఆప్కో దుకాణాలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డితో కలిసి జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆప్కో షాపును మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం చేనేత వ్యవస్థను నిర్వీర్యం చేస్తే చంద్రబాబు పాలనలో అన్నివిధాలా ఆదుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో వంద చేనేత షాపులను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే 97 పూర్తి చేశామన్నారు. త్వరలో వందో షాపు ప్రారంభిస్తామన్నారు. చేనేతలకు 15 శాతం సబ్సిడీతో నూలు అందిస్తున్నామన్నారు. ప్రతి ఉద్యోగీ వారంలో ఒకరోజు చేనేత వస్త్రాలు ధరించడం ద్వారా నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. దేశంలోని ప్రధాన నగరాల్లో చేనేత బజార్లు ఏర్పాటు చేస్తామన్నారు. అందరూ చేనేత వస్త్రాలను ధరించి, నేతన్నలను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే చేనేతలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందిస్తున్నామనీ, దీనిని 500 యూనిట్లకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ... చేనేత వస్త్రాలను ధరించడం ద్వారా ఆరోగ్యంతో పాటు నేతన్నలకు అండగా నిలిచినవారమవుతామన్నారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు చీరలను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఆప్కో ఎండీ పావనమూర్తి, ఆర్డీఓ సువర్ణ, జీఎం నాగేశ్వరరావు, ఏడీ రామకృష్ణ, జీఎంఓ మధుబాబు, కమిషనర్ ప్రహల్లాద, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌తో ఉజ్వల భవిత

జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు

మిట్స్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో ఇంజనీరింగ్ ముఖ్యభూమిక పోషిస్తుందని, ఇంజనీరింగ్ విద్యనభ్యసించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(మిట్స్) కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు ఇన్‌చార్జ్ వీసీతోపాటు కళాశాల సెక్రెటరీ డాక్టర్ విజయభాస్కర్ చౌదరి, ప్రెసిడెంట్ ద్వారకానాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు మాట్లాడుతూ యువత మేధస్సు గలగల పారే సెలయేరులాంటిదన్నారు. సక్రమంగా సద్వినియోగం చేసుకున్న వారు ఇస్రో, డీఆర్‌డీఏ వంటి సంస్థల్లో శాస్త్రవేత్తలుగా స్థిరపడతా రని తెలిపారు. ఆ దిశగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని అడుగులు వేయాలని సూచించారు. మిట్స్‌లో ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసిన అనేక మంది విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిని అందుకున్నారని గుర్తుచేశారు. కళాశాల సెక్రెటరీ డాక్టర్ విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ బీటెక్ పూర్తిచేసిన వెంటనే ప్రతి విద్యార్థికి ఉద్యోగాన్ని కల్పించేలా అంతర్జాతీయ సంస్థలతో ఎంఓలు కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

1.642 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.642 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 1079 క్యూసెక్కులున్నట్లు చెప్పారు. అవుట్‌ఫ్లో హెచ్‌ఎన్‌ఎస్ఎస్-2కు 1039 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్తం

నేడు, రేపు ఓటరు నమోదు

అనంతపురం రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారల్లో రెండురోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గం ఎన్నికల అధికారి కేశవనాయుడు, అర్బన్ తహసీల్దార్ హరికుమార్ తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. బీఎల్ఓలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రజల నుంచి కొత్త ఓటరు నమోదు, తొలగింపు, ఓటరు నమోదులో మార్పు, సవరణలకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. బీఎల్ఓలందరూ అందరూ సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

● రాప్తాడు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీ ఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల పనుల పరిశీలన


మరూరులో పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

రాప్తాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను నాణ్యంగా చేపట్టాలని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఆమె శుక్రవారం మండలంలోని మరూరు, మైనార్టీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ... పంచాయతీ రాజ్ అధికారులు పనులను నిత్యం పర్యవేక్షిస్తూ, నాణ్యంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మరూరు సచివాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

కనగానపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల నూతన ఎస్ఐగా మహమ్మద్ రిజ్వాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఇషాక్‌బాషా బదిలీ కావడంతో ఆయన స్థానంలో కర్నూలు జిల్లా కౌతాళం పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న మహమ్మద్ రిజ్వాన్‌ను బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మద్యం స్వాధీనం

అనంతపురం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కూడేరు మండలం ఇప్పేరు క్రాస్ వద్ద రాష్ట్రానికి చెందిన 55 మద్యం బాటిళ్లను అక్రమంగా బెల్ట్ షాప్‌నకు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. అనంతపురం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ, ఎస్ఐ హరికృష్ణ, సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

చీనీ కాయలు టన్ను రూ.33వేలు

అనంతపురం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.33 వేలు పలికినట్టు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 14వేలు, సరాసరి రూ. 23వేలుతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 72 టన్నుల చీనీ కాయలు వచ్చాయన్నారు.

విజిలెన్స్ దాడులు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పలు జనరల్ స్టోర్లపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. సీఐ జమాల్ బాషా ఆధ్వర్యంలో శుక్రవారం పాతవూరిలోని సతీష్ జనరల్ స్టోర్స్ సాయి వల్లి మిక్చర్స్‌లో తనిఖీలు చేశారు. ప్యాకింగ్‌పై తయారీ వివరాలు, వినియోగదారులకు అవసరమైన సమాచారం లేకపోవాడం, ఎమ్ఆర్‌పీ కూడా ముద్రించనట్లు గుర్తించామని సీఐ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వాహణ ఉండటంతో కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు. రూ.50 వేలు అపరాధ రుసుం విధించామన్నారు. ఈ తనిఖీల్లో ఏఓ వాసుప్రకాష్, డీసీటీఓ విజయలక్ష్మి, సురేష్‌కుమార్, లీగల్ మెట్రాలజీ అధికారి మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం: బెంగళూరు నార్త్‌లో తెలుగుదేశం పార్టీకి క్రియాశీలకంగా పనిచేసే నాయకుడు పి నవీన్‌కుమార్ శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీని అనంతపురంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించినందుకు ఆమెను సన్మానించి అభినందించారు.

గుంతల రోడ్లకు త్వరలో మోక్షం

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
● తిలక్‌నగర్‌లో మీ ఇంటికి - మీ ఎమ్మెల్యే


వృద్ధురాలితో సమస్యలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గంలో గుంతలు పడిన రోడ్లకు త్వరలోనే మోక్షం లభిస్తుందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం నగరంలోని 12వ డివిజన్‌లో నగర పాలక సంస్థ కమిషనర్ నాగరాజు, కార్పొరేటర్ బాబాఫక్రుద్దీన్‌తో కలిసి మీ ఇంటికి - మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. తిలక్ రోడ్డులో రోడ్లు ఇరుకుగా ఉన్నాయని, పైగా గుంతలు పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. డ్రైనేజీ కాలువలు కూడా సరిగా శుభ్రం చేయడం లేదని వా పోయారు. నగరంలో రోడ్ల మరమ్మత్తుల కోసం ఇప్పటికే రూ.35 లక్షలు ఎన్‌సీఏపీ నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే గుంతలు పడిన రోడ్లకు మరమ్మ తులు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అధ్వానంగా మారిన పరిస్థితులను ఒక్కొక్కటి మారుస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతుల లక్ష్మీనరసింహు లు, సరిపూటి రమణ, కృష్ణకుమార్, బాలసుబ్రహ్మణ్యం, మున్వర్, లక్ష్మీనరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలానా విగ్రహం ఏర్పాటుకు చర్యలు

అనంతపురం అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ చొరవతో స్వాతంత్ర్య సమరయోధుడు అబుల్ కలాం ఆజాద్ విగ్ర హాన్ని క్లాక్ టవర్ సమీపంలో తిరిగి ఏర్పాటు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణలో భాగంగా ఆ విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించారు. పలువురు మైనార్టీ నాయకుల విన్నపానికి స్పందించిన ఎమ్మెల్యే తిరిగి క్లాక్‌టవర్ సమీపంలో అబుల్ కలాం ఆజాద్ విగ్రహం ఏర్పాటు చేయిస్తున్నారు. విగ్రహం ఏర్పాటును ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు.

గురుకులంలో మౌలిక వసతులు కల్పించండి

● ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి పీఎస్ఎఫ్ఐ నాయకుల వినతి


ఎమ్మెల్యేకి వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి నాయకులు

గార్లదిన్నె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏపీఆర్ఎస్ మైనార్టీ గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (పీఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఆలం డిమాండ్ చేశారు. పీఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఆలం, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, జిల్లా కార్యదర్శి ప్రతిభా భారతి, ఉపాధ్యక్షురాలు మౌనిక శుక్రవారం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని అనంతపురంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గార్లదిన్నెలో నిర్వహిస్తున్న ఏపీఆర్ఎస్ మైనార్టీ గురు కుల పాఠశాలలో ఉమ్మడి జిల్లాలలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 450 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. అయితే కేవలం 12 గదులు మాత్రమే ఉన్నాయన్నారు. గదుల కొరతతో పాటు మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పగలు తరగతి గదులుగా, రాత్రి పడక గదులుగా వినియోగిం చుకుంటున్నారని అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకి అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.... సంబంధిత అధికారులతో చర్చించి మైనార్టీ గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

శింగనమల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అరుగురు బాధితులకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశా రు. ఆమె శుక్రవారం అనంతపురం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం చెందిన అరుగురికి రూ.6,34,089 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తీవ్ర అనారోగ్యం, ప్రమాదంలో గాయపడిన నియోజకవర్గంలోని ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్య ఖర్చులు అందజేస్తామని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై వినతి


ఓఎస్‌డీకి వినతిపత్రం ఇస్తున్న సమాఖ్య నాయకులు

అనంతపురం న్యూటౌన్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని పం చాయతీ కార్యదర్శుల సమాఖ్య నాయకులు పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణకు విన్నవించారు. వారు శుక్రవారం ఆయనను విజయవాడలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రధానంగా జీఓ ఎమ్ఎస్ నంబర్ 84ను సవరించాలని కోరినట్లు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ తెలిపారు. జిల్లాల వారీగా పంచాయతీల్లో ఖాళీగా ఉన్న స్థానాల్లో గ్రేడ్-3, గ్రేడ్-4 కార్యదర్శు లను పదోన్నతి ద్వారా నియమించాలని, గ్రేడ్ సిస్టంను తగ్గించాలని, క్లస్టర్ అఫ్లేషన్ చేయాలని కోరినట్లు తెలిపారు. స్పందించిన ఓఎస్‌డీ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారన్నారు. నాయకులు సాయిరామ్, కొండలు, జయరాం, నరేష్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం సీజ్


సీజ్ చేసిన బియ్యంతో విజిలెన్స్ అధికారులు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం మెరుపు దాడులు నిర్వహించారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 49 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేశారు. స్థానిక చిన్మయ నగర్‌లోని ఆడిటర్స్ కాలనీలో తనిఖీలు చేపట్టారు. అటు వైపు వచ్చిన వాహనంలో 40 బ్యాగుల్లో (19 క్వింటాళ్లు) తరలి స్తున్న బియ్యాన్ని సీజ్ చేశారు. బియం యజమాని వెంకటరాముడును అదుపులోకి తీసుకొని కేసునమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని రాప్తాడు సీఎస్‌డీటీకి అప్పగించినట్లు తెలిపారు. అలాగే రూరల్ మండల పరిధిలోని సోములదొడ్డి పంచాయతీ దండోరా కాలనీలో 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని లోడ్ చేసిన వాహనాన్ని పట్టుకొని సీజ్ చేశారు. బియ్యం యజమాని, డ్రైవర్ అయిన కుళ్లాయప్పను, వాహన యజమాని సురేష్‌ను అదుపులోకి తీసుకొని కేసునమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో ఏఓ వాసుప్రకాష్, రాప్తాడు సీఎస్‌డీటీ జ్యోతి, ఇంతియాజ్ అహ్మద్, అనంతపురం రూరల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

అనంతపురం సెంట్రల్, నవబంబరు 8(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశా లలో శుక్రవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జె. శ్రీనివాసులు అధ్యర్యంలో ఫ్యాక్ట్‌సెట్ ఇండియా సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్వ్యూల ను నిర్వహించారు. వీటిలో ప్రతిభకనబర్చిన 31మంది విద్యార్థులకు శనివారం చివరి పరీక్షలు నిర్వహించి ఎంపికైన విద్యార్థులకు రూ.10లక్షల వార్షికవేతనం అందజేస్తామని సంస్థ ప్రతినిధులు ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి పేర్కొన్నారు.

ఉపాధి అవినీతిపై చర్యలు తీసుకోవాలి

● డ్వామా పీడీకి వ్యవసాయ కార్మిక సంఘం వినతి


డ్వామా పీడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శుక్రవారం డ్వామా కార్యాలయంలో పీడీ సలీంభాషాను కలిసి ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలరంగయ్య, కృష్ణమూర్తి విన్నవించారు. గత ఐదేళ్లలో కొందరు ఉద్యోగులు, వైసీపీ నాయకులు కలిసి, గ్రామీణ ప్రాంతాల పేదలకు వరంగా ఉన్న ఉపాధి పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. అలాగే డ్వామాలో ఇష్టానుసారంగా చేపట్టిన ఉద్యోగుల బదిలీలను ఆపాలన్నారు. అధికారులు స్పందించని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మికసంఘం నాయకులు రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్లను త్వరగా నిర్మించండి : పీడీ

రాప్తాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. మండలం లోని రాప్తాడు, రామినేపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న గోకులం షెడ్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ... పాడి పశువులు, గొర్రెలు, మేకలు పెంపకం కోసం ప్రభుత్వం గోకులం షెడ్లు మంజూరు చేసింద న్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు. షెడ్లు మంజూరైన రైతులు వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ కొలతల ప్రకారం షెడ్లను నాణ్యంగా నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ అనురాధ, ఏపీఓ సావిత్రి, టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ శివ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'క్రైస్తవులకు నిధులు కేటాయించండి'



అనంతపురం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబును టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం అమరావతిలోని ఏపీ సచివాలయంలో సీఎంను కలిసి వినతి పత్రం అందజేశారు. క్రైస్తవులకు తగు విధంగా న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.



● అనంతపురం అర్బన్, : రాష్ట్ర డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన శుక్రవారం అమరావతిలోని ఏపీ సచివాలయంలో పవన్‌కళ్యాణ్‌ను కలిశారు.

పీడీని కలిసిన జిల్లా సమాఖ్య కార్యవర్గం


వెలుగు పీడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రశాంతి జిల్లా సమాఖ్య సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వర య్యను ప్రశాంతి జిల్లా సమాఖ్య నూతన కార్యవర్గం సభ్యురాళ్లు కలిశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు సుశీల, రాధమ్మ, ఉపాధ్యక్షురాలు రామలక్ష్మీ, సహాయ కార్యదర్శి పర్వీన్, కోశాధికారి భాగ్యలక్ష్మీ శుక్రవారం డీఆర్‌డీఏ-వెలుగు పీడీని మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లాలో వంద రోజుల ప్రణాళికతో మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నామని పీడీ ఈ సందర్భంగా తెలిపారు. మహిళల అభివృద్ధితోనే జిల్లా అభివృద్ధి సాధ్యమని ఆయన పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాపోరు

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


రాజీవ్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసమే సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు చేపట్టినట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు చేపడుతున్న ప్రజాపోరులో భాగంగా తొలిరోజున రాజీవ్ కాలనీ పంచాయతీలోని పలు కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లా డుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి రాకముందు అనేక హామీలను ఇచ్చి, ఇపుడు అమలు చేయడంలో జాప్యం చేస్తున్నాయని విమర్శించారు. అలాగే నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా ధరలు పెరిగాయని తెలిపారు. మహిళలు, దళితులు, బాలికల పై నిత్యం అత్యాచారాలు, హత్యలు, దాడులు జరుగుతున్నాయన్నారు. చదువుకున్న యువత కు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలందరికీ సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని, విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయని డిమాండ్‌చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14వ తేదీన ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నగర ఒకటో కమిటీ కార్యదర్శి రామిరెడ్డి, రాజీవ్ కాలనీ ఉపసర్పంచ్ మసూద్, సీపీఎం నగర నాయకులు ప్రకాష్, వలి, నూరుల్లా, డేవిడ్, మహదేవ్‌నగర్ శాఖ కార్యదర్శి వెంకట శ్రీనివాసులు, గనేనాయక్ కాలనీ కార్యదర్శి రాము, లాలు, ఆది, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'అమిగోస్ ఆగడాలను నియంత్రించాలి'

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మైన్స్‌లో అమిగోస్ మినరల్స్ సంస్థ ఆగడాలను నియంత్రించాలని మైన్స్ లీజ్ కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధి రాజేష్ ప్రభుత్వాన్ని కోరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమిగోస్ సంస్థ రాయల్టీ కలెక్షన్ కోసం రెండేళ్ల పాటు లీజు అగ్రిమెంట్‌ను రూ.260 కోట్లకు తీసుకుందని, నెలకు రూ.10.79 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. అయితే అమిగోస్ సంస్థ ఇప్పటి వరకు ప్రభుత్వానికి రూ.100కోట్లు బకాయి ఉందన్నారు. ఎర్రమట్టికి రాయల్టీ ఎగవేసి దోచుకుందన్నారు. ప్రభుత్వం మారినా అమిగోస్ ఆగడాలు జిల్లాలో ఆగడం లేదన్నారు. క్వారీల్లో మట్టి, ఇతర ఖనిజాలను టిప్పర్ల ద్వారా తోలుకోవచ్చని ఇష్టారాజ్యంగా వ్యవహరి స్తోందన్నారు. అమి గోస్ అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేసి ప్రజాధనాన్ని కాపాడాలని కోరారు.

పంచాయతీల ఆదాయం పెంచాలి

● అధికారులతో ఎమ్మెల్యే పరిటాల సునీత


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తూ, పంచాయతీల ఆదా యం పెంచడమే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలు, ఎన్ఆర్ఈజీఎస్, పీఆర్ ఇంజనీర్లతో ఎమ్మెల్యే శుక్రవారం నగరంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా... ఎమ్మెల్యే నియోజకవర్గంలో జరుగుతున్న పనులు, గ్రామాల్లోని సమస్యలపై అధికారులతో చర్చించారు. ముఖ్యమైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయలన్నారు. గ్రామాల్లో తాగు నీరు, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తూ, పంచాయతీల ఆదాయం పెంచాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి గుత్తులు చెల్లించే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. పంచాయతీలు, మండలాల వారీగా చేపట్టాల్సిన పనులపై చర్చించారు. రాప్తాడు నియోజకవర్గంలో రూ. 25 కోట్ల ఉపాధి హామీ నిధులతో మంజూరైన సీసీ రోడ్ల పనులు వేగవంతంగా, నాణ్యంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో అక్రమాలు చోటు చేసుకో కుండా పనులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

న్యాయవాద హక్కులను కాపాడుకోవాలి

● బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

అనంతపురం సెంట్రల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): న్యాయవాద విద్యను అభ్యసించిన ప్రతి ఒక్కరూ వృత్తి హక్కులను కాపాడుకోవాలని బహుజన లాయర్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది బానాసి నారాయణప్ప అన్నారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్ఎఫ్ ప్రథమ వార్షికోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. బాధితులకు నిష్పక్షపాతంగా న్యాయసేవలు అందించాలని సూచించారు. వృత్తి హక్కులను కాపాడుకునే అంశం గురించి ఈ నెల 24న విజయవాడలో నిర్వహించే బీఎల్ఎఫ్ వార్షికోత్సవ సభలో చర్చిస్తామని అన్నారు. న్యాయవాదులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్, బీఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మూర్తి, గౌరవాధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రమేష్, ప్రధాన కార్యదర్శి మహేశ్వరి, ట్రెజరర్ అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయండి

● పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి

అనంతపురం న్యూటౌన్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి సూచించారు. గుంతకల్లు నియోజకవ ర్గానికి చెందిన పలువురు శుక్రవారం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ కార్యాలయంలో గుంతకల్లు నియోజకవర్గానికి చెందిన తిమ్మారెడ్డి, మల్లికార్జున ఆధ్వర్యంలో జిలాన్, కుళ్లాయప్ప, రామిరెడ్డి, చంద్రతో పాటు దాదాపు 30 మంది దాకా కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జిల్లా అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శీన, ప్రసాద్‌రెడ్డి, ఓబిలేసు, మూర్తి, షఫీ, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ముందుందాం

● టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కుంటిమద్ది రంగయ్య

రామగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో ప్రతి కార్యకర్త, నాయకులు ప్రత్యేక శ్రద్ధ వహించి రాప్తాడు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ముందుండేలా చూద్దామని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని టీడీపీ కార్యాల యంలో శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య మాట్లాడుతూ...టీడీపీ సభ్యత్వ నమోదుపై ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. అందదూ సమన్వయంతో విజయవంతంచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, సీనియర్ నాయుడు రామ్మూర్తి నాయుడు, మాజీ ఎంపీపీ పరంధామయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, తెలుగుయువత అధ్యక్షుడు లింగా శ్రీధర్‌నాయుడు, ఎంపీటీసీ శ్రీనివాసులు, నాగేశ్, సుబ్బరాయుడు, పోతన్న, ప్రభాకర్, పేరూరు వడ్డి సుబ్బు, రామాంజినేయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

శింగనమల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం కేంద్రమైన శింగనమలలో టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. టీడీపీ సీనియర్ నాయకులు శుక్రవారం గొల్ల వీధిలో ఇంటింటికి వెళ్లి, పార్టీ కార్యకర్తలకు కల్పించే బీమాపై అవగాహన కల్పించారు. సభ్యత్వ నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మెండెం ఎర్రి స్వామి, రాజశేఖర్‌యాదవ్, బాలరాజు, తిప్పయ్య, ఆంజనేయులు, శివయాదవ్, మహేశ్ యాదవ్, భరత్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్ పోటీలకు వర్షిత


వర్షితను అభినందిస్తున్న డీఈఓ తదితరులు

అనంతపురం క్లాక్‌టవర్/ ఎడ్యుకేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ అథ్లెటిక్ పోటీలకు జిల్లాకు చెందిన ఎ. వర్షిత ఎంపికైంది. గుంతకల్లు మండలం ఎన్ నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఎస్‌జీఎఫ్-14 రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో బాలికల విభాగంలో 400మీటర్లు, 600మీటర్లు పరుగుపందెంలో రెండు బంగారు పతకాలు సాధించింది. రిలేలో తృతీయ స్థానంతో రాష్ట్రస్థాయి ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. ఆమె ఈ నెల 15వతేదీ నుంచి జార్ఖండ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. వర్షితను డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ నాగరాజు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, పీడీ చల్లా ఓబుళేసు, వేణుగోపాల్, విద్యార్థి తండ్రి పార్థసారథి శుక్రవారం అభినందించారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల పరిశీలన



అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో 25 ఏళ్లగా డ్రైనేజీ సమస్య నెలకొని ఉందని, మురుగుకాల్వలు సరిగా లేకపోవడం వల్ల ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు, వర్షాల సమయంలో వరదనీరు రోడ్లపై పారుతూ తీవ్ర అపరిశుభ్రత నెలకొని ఉండేదని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతుండేవారని, ఇప్పుడు ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చేయనున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక పాతబస్టాండ్ వద్ద జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే శుక్రవారం మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనులు నాణ్యతగా చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణాన్ని కూడా త్వరగా పూర్తి చేసి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ద్వారా మురుగునీరు, వరద నీరు వెళ్లేలా చేయాలని సూచించారు. కొన్నేళ్ల నుంచి పట్టి పీడిస్తున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు పేర్కొన్నారు.

పారదర్శకంగా అంగన్‌వాడీ పోస్టుల భర్తీ..

పార్టీలకు అతీతంగా అంగన్‌వాడీ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేశామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద నూతనంగా నియామకమైన అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలకు ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారదర్శకంగా రాజకీయాలకు అతీతంగా పోస్టులను భర్తీ చేశామన్నారు. నియామకపత్రాలు అందుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



కళేకుర్తిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలవ

కణేకల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళేకుర్తి గ్రామంలో రూ. 1.08 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు. అలాగే శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామీణ రహదారులపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగానే ఇప్పటికే పలు రహదారులకు నిధులు మంజూరు చేసి పనులు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు ఆనంద్‌రాజ్, కళేకుర్తి సుదర్శన్, ఆది, వేలూరు మరియప్ప, వన్నారెడ్డి, బీటీ రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి ప్రతిపాదన

బొమ్మనహాళ్: మండలంలోని కళ్లదేవనహళ్లి, బండూరు, సింగానహళ్లి గ్రామాల రోడ్లు, కల్వర్టులు ఇటీవల కురిసిన వర్షానికి కోతకు గురైన విషయం తెలిసిందే. దీనివల్ల ఆయాగ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే ఇబ్బంది పడుతున్న తీరుపై ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే శుక్రవారం సింగానహళ్లి గ్రామానికి వచ్చి రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపినట్లు స్థానికులకు తెలిపారు. త్వరలో పనులు జరుగుతాయన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

నేడు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

డీ.హీరేహాళ్: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు గాను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి ప్రకటనలో తెలిపారు. హులికల్లు, కాదలూరు, మల్లికేతి గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపనలు చేసేందుకు ఎమ్మెల్యే రానున్నట్లు పేర్కొన్నారు. అలాగే కాదలూరు గ్రామంలో పార్టీ మండల సమావేశం నిర్వహిస్తారని, మండల వ్యాప్తంగా ఉన్న టీడీపీ శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుడి మృతికి నివాళి

శెట్టూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలేడుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నరసింహులు (38) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న ఎంఈఓ శ్రీధర్, పలువురు ఉపాధ్యాయులు శుక్రవారం ములకలేడుకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే అంత్యక్రియల్లోనూ పాల్గొన్నారు. పాడెను ఎంఈఓ మోశారు. ఉపాధ్యాయులు ఎంఎస్‌రాయుడు, రాజన్న, తిప్పేస్వామి, చిరంజీవి, వెంకటేష్, మహేష్, మారుతి తదితరులు ఉన్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ ఎన్నికల ప్రచారం

గుంతకల్లు, నవంబరు8(ఆంధ్రజ్యోతి): రైల్వేలో కార్మిక సంఘం గుర్తింపు కోసం నిర్వహిస్తున్న ఎన్నికల్లో భాగంగా మజ్దూర్ యూనియన్ నాయకులు ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని డీఆర్ఎం కార్యాలయం, కంట్రోల్ కార్యాలయం, అకౌంట్స్ కార్యాలయాలలో శుక్రవారం ఉదయం స్థానిక యూనియన్ నాయకులు తమ సంఘానికే ఓటు వేయాలని ఉద్యోగులను కోరారు. మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్, రైల్వే విశ్రాంతి ఉద్యోగుల యూనియన్ డివిజనల్ కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల తరపున అలుపెరుగని పోరాటం చేసిన చరిత్ర మజ్దూర్ యూనియన్‌ది అన్నారు. నాయకులు రాజశేఖర్, సుధాకర్, ఎస్ఎం బాషా తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ కౌన్సిల్ సమావేశం

గుంతకల్లుటౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అకాడమిక్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో సిలబస్, పరీక్షల పనితీరు, ఇంటర్న్‌షిప్ తదితర అంశాలపై చర్చించారు. తర్వాత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ అటానమస్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్కేయూ ప్రొఫెసర్ రవిప్రసాద్‌రావు, డిపార్ట్‌మెంట్ ఆఫ్‌బోటనీ ప్రొఫెసర్ గీతాంజలి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ప్రభాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో అన్ని సేవలు ఉచితమే

పామిడి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో అన్ని సేవలు ఉచితమేనని వైద్యాధికారి డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆసుపత్రిలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆసుపత్రి నుంచి జారీ చేసే కొన్ని ధృవీకరణ పత్రాలకు బయట వ్యక్తులు డబ్బు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఆసుపత్రి నుంచి అందజేసే అన్ని సర్టిఫికెట్లు, వైద్య సేవలు పూర్తిగా ఉచితమేనన్నారు. ఎవరైనా డబ్బు అడిగితే తనకు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా పోరు: సీపీఎం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న రాంభూపాల్

గుంతకల్లుటౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన ప్రజా పోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి పొట్టిశ్రీరాములు విగ్రహం వరకు కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నెల రోజుల నుంచి కూరగాయలు, నిత్యావసరవస్తువులు, వంటనూనె ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. ఇలా అయితే సామాన్య మధ్యతరగతి ప్రజలు ఏమి కొంటారని ఆవేదన చెందారు. వెంటనే ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇక రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తే ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్న యువతకు నిరాశే మిగిలిందన్నారు. అలాగే మహిళలు, పిల్లలపై అత్యాచారాలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. అంతేకాకుండా ఇసుక, మద్యం మాఫియా అధికమవుతోందని మండిపడ్డారు. వెంటనే వాటిని అరికట్టాలని కోరారు. ట్రూఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై వేసిన రూ. 20వేల కోట్ల భారాన్ని కూడా వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సాగునీటి వనరులకు రూ.7వేల కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బీ శ్రీనివాసులు, డీ శ్రీనివాసులు,పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు మారుతిప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, సురేంద్ర, రమేష్, తిమ్మప్ప, వెంకీ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్పు పరికరాలు దగ్ధం

పుట్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడ్డిపల్లి గ్రామంలో రైతు రాజశేఖర్‌రెడ్డికి చెందిన అరటితోటలో డ్రిప్పుపరికరాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. తోటలో అరటి, మొక్కజొన్న పంటలు సాగు చేశానని, అక్కడున్న డ్రిప్పు పరికరాలకు శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయాయని బాధితుడు వాపోయాడు. దీంతో సుమారు రూ.70వేలు నష్టం వాటిల్లిందన్నాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

యాడికి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఓటరు హక్కు నమోదు కోసం ఫారం-6, 7, 8, 8ఏ దరఖాస్తులు స్వీకరిస్తారని అన్నారు. మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్వోలు అందుబాటులో ఉండి నమోదు చేయిస్తారన్నారు. 18 ఏళ్ల వయసు నిండిన ప్రతిఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

తాడిపత్రి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పుట్లూరు మండలంలోని దోసలేడు గ్రామంలో సెకెండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు రాజా రమేష్‌పై శుక్రవారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. పట్టణంలోని కృష్ణాపురం రోడ్డులో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు రాజారమేష్ చిట్టీలు, ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. వీటికి సంబంధించి దాదాపు రూ.60లక్షలను పలువురి నుంచి తీసుకుని ఇవ్వకపోగా సెల్‌ను స్విఛాఫ్ చేసుకుని పారిపోయాడు. దీంతో బాధితులు రంగస్వామి, ప్రసాద్, తిరుపాలు, సందీప్‌తో పాటు మరికొంతమంది ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

బొందలదిన్నెలో సీఐ పర్యటన

తాడిపత్రి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలదిన్నెలో శుక్రవారం రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచించారు. ప్రజల జీవనానికి ఆటంకం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించమని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం వంగనూరు గ్రామసమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించి వాహనదారులకు పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ప్రణాళిక సిద్ధం చేయండి

రాయదుర్గంరూరల్, నవంబరు 8: ఉపాధిహామీ పథకంలో 2025-26 వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపునకు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఏపీడీ అయేషా అధికారులకు సూచించారు. పట్టణ సమీపంలోని డ్వామా కార్యాలయంలో శుక్రవారం ఆమె రాయదుర్గం, కళ్యాణదుర్గం పరిధిలో ఉన్న ఉపాధిహామీ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆర్థిక సంవత్సరంలో పనులు గుర్తింపును పక్కా ప్రణాళికతో తయారు చేసి డిసెంబరు 31లోగా కలెక్టర్‌కు నివేదిక అందించాలని సూచించారు. అదే విధంగా ఉపాధి పథకంలో నిర్వహించే పనులపై కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. ట్రైనింగ్ కోఆర్డినేటర్ రామ్మూర్తి మాట్లాడుతూ పనుల గుర్తింపుపై ప్రణాళిక పక్కాగా తయారు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓలు, టీఏలు, ఈసీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి 30 మంది చేరిక

గుంతకల్లుటౌన్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన 30 మంది కాంగ్రెస్‌లోకి చేరారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో వారు పార్టీలోకి చేరారు. వారికి మధుసూదన్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రైతు సంఘం మాజీ నాయకులు మునలిరెడ్డి, తిమ్మారెడ్డి, గాలిమల్లికార్జున తదితరులు చేరిన వారిలో ఉన్నారు.

ఘనంగా గంధం ఊరేగింపు



గంధాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

విడపనకల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన గురుతాత స్వామి గంధం ఊరేగింపును శుక్రవారం రాత్రి ఘనంగా ఊరేగించారు. స్థానిక సజ్జాద నషీన్ సయ్యద్‌షా గరీబ్‌పీర్ ఖాద్రి ఇంటి నుంచి గంధంను తీసుకొచ్చి గ్రామ వీధుల్లో మేళ తాళాలు, తప్పెట్ల మధ్య ఊరేగిస్తూ దర్గాకు చేర్చారు. ఈ ఊరేగింపులో మత పెద్దలు పాల్గొన్నారు. ఉరుసు సందర్భంగా స్వామి దర్గాను విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో గరువులు సయ్యద్‌షా గరీబ్ పీర్ ఖాద్రి సాహెబ్, సయ్యద్ షా అమీర్‌పీర్ ఖాద్రి సాహెబ్, సయ్యద్ షా చాంద్ పీర్ ఖాద్రి సాహెబ్, సయ్యద్ షా సిరాజ్ పీర్ ఖాద్రి సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

18న కనకదాసు జయంతి

గుంతకల్లుటౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీరప్ప సర్కిల్లో ఈనెల 18న కనకదాసు జయంతిని నిర్వహించనున్నట్లు కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు నాగేంద్ర తెలిపారు. పట్టణంలోని కురుబ చంద్రశేఖర్ స్వగృహంలో శుక్రవారం కురుబ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కురుబల ఆరాధ్య దైవం భక్తకనకదాసు జయంతిని ఈనెల 18న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్నట్లు మంత్రి సవిత, ఎంపీ పార్థసారధి తెలిపారన్నారు. పట్టణంలో జరిగే కనకదాసు జయంతికి నియోజకవర్గం నుంచి కురుబలు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు వళికేరి శివ, చంద్రశేఖర్, పాలమల్లికార్జున, వళికేరి జగదీశ్వర బాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గుత్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు కదిరప్ప(74) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక గుంతకల్లు రోడ్డులో కదిరప్ప రోడ్డుదాటుతుండగా వెనుక వైపు నుంచి లారీ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా.. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత కుటుంబసభ్యులు మెరుగైన వైద్యంకోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందినట్లు చెప్పారు.

ఆర్థిక సాయం

కుందుర్పి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కిడ్నీ సమస్యతో బాధ పడుతున్న మండలంలోని జంబుగుంపల గ్రామానికి చెందిన దుర్గన్నకు మండలకేంద్రానికి చెందిన ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. నిరుపేద అయిన దుర్గన్న కిడ్నీ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న బద్దేనాయక్ ఆయనకు ఆస్పత్రుల ఖర్చుల నిమిత్తం 15 వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు.

భూముల రీసర్వే

తాడిపత్రి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో భూమి లేదా స్థలాలను రీసర్వే చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వంద సంవత్సరాల తర్వాత పట్టణ పరిధిలోని ఏపీ రీసర్వే ప్రాజెక్ట్‌లో భాగంగా సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూవివాదాలు, ఆస్తితగాదాలు పరిష్కార మవుతాయని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా..

ఘనంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ

బొమ్మనహాళ్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సింగానహళ్లిలో మారెమ్మ, సుంకులమ్మ విగ్రహాల ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా జరిగింది. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి.. అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ

శెట్టూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం ఆంజనేయ స్వామి విగ్రహం, ధ్వజస్తంభం, నాగ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

13న ధ్వజస్తంభం..

బెళుగుప్ప, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వరసిద్ధ వినాయక ఆలయం ఎదుట ఈనెల 13వ తేదీన ధ్వజస్తంభాన్ని ఘనంగా ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ సేవా సమితి సభ్యులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాంబాబు స్వామి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 13న మలయాళం పండితుడు బ్రహ్మశ్రీ రంగం సరున్మోహన చేతుల మీదుగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరపనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్దఎత్తున రావాలని కోరారు.

గ్రామ సభలు

శెట్టూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనంపల్లి, కైరేవు గ్రామాలలో శుక్రవారం సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామసభలు నిర్వహించారు. ఇందులో సంవత్సర కాలంలో ఉపాధి హామీ ద్వారా ఆయా గ్రామాల్లో జరిగిన పనులు వివరాలను గ్రామాల ప్రజల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఎస్ఆర్పీ లక్ష్మీనారాయణ, ఏపీ నీరజ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం

కళ్యాణదుర్గం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని దురదకుంట గ్రామ సర్పంచ్ గరికపాటి అరుణమ్మ టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదును తీసుకున్నారు. ఆన్‌లైన్‌లో శుక్రవారం ఆమె రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని అందుకున్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కళ్యాణదుర్గం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పాల వెంకటాపురం, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం పరిసర ప్రాంతాలలో శుక్రవారం అధికారులు లక్ష్మీసుహాసిని, నరేష్‌బాబు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఇందులో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న అమర నాగమణిని అరెస్టు చేసి ఆమె వద్ద నుండి 96 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆమెపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రీడా మైదానం పరిశీలన

కళ్యాణదుర్గం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కరణం చిక్కప్ప క్రీడా మైదానాన్ని ఏపీ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ప్రకాష్‌రెడ్డి, యోగి శుక్రవారం టీడీపీ నాయకుడు అవినాష్‌తో కలిసి పరిశీలించారు. గతంలో ఈ మైదానంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ జరిగింది. దీంతో ఏపీ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఈ మైదానాన్ని పరిశీలించి అవినాష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్రికెట్ ఆడేందుకు వీలుగా మైదానాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

సొసైటీ మాజీ డైరెక్టర్‌పై దాడికి యత్నం

ఉరవకొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం చాబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సహకార సంఘం మాజీ డైరెక్టర్ కేదార్‌నాథ్‌పై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేంద్ర దాడికి యత్నించాడు. ఇటీవల ఆ పాఠశాలలో వాచ్‌మెన్‌ను నియమించారు. ఈ విషయంపై వివరాలు తెలుసుకునేందుకు వెళ్లిన సొసైటీ మాజీ డైరెక్టర్‌పై ప్రధానోపాధ్యాయుడు దురుసుగా ప్రవర్తించి దాడికి యత్నించాడు. ప్రధానోపాధ్యాయుడి తీరును నిరసిస్తూ కేదార్‌నాథ్ అక్కడ ఆందోళన చేపట్టాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడకు చేరుకుని వారిద్దరికీ సర్దిచెప్పి రాజీ ప్రయత్నం చేయడంతో వివాదం సద్దుమణిగింది.

పేకాట ఆడుతున్న 13 మంది అరెస్టు

బొమ్మనహాళ్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని హెచ్ఎల్‌సీ వద్ద పేకాట కేంద్రంపై పోలీసులు గురువారం రాత్రి దాడులు చేశారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసి పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్టు చేశామని ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 87,040 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిని రాయదుర్గం కోర్టుకు హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

తాడిపత్రి: మండలంలోని వెంకటరెడ్డిపల్లి సమీపంలో గల రమేష్‌విల్లాస్ వద్ద పేకాట ఆడుతున్న ఐదగురిని అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.15740 నగదు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి వారిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

అక్షరాస్యత పెంపునకు సహకరించండి

బ్రహ్మసముద్రం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అక్షరాస్యత పెంపునకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో నందకిషోర్ కోరారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. అక్షరాస్యతకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. వెలుగు ఏపీఎం హుస్సేన్, ఎంఈఓ కృష్ణానాయక్, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా భోగ్ మహోత్సవం

ఉరవకొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం రూపానాయక్ తండాలో శుక్రవారం కార్తీక మాసం భోగ్ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తండావాసులు స్థానిక గురునానక్ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. తర్వాత సామా సంగ్ మహరాజ్ గాదిని ఊరేగిస్తూ.. కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు తులసీదాస్ నాయక్, సుబ్రహ్మణ్యం నాయక్, నారాయణ్ నాయక్, లక్ష్మానాయక్ పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న తండావాసులు

చిరువ్యాపారులు ఆర్థికంగా ఎదగాలి: జేసీపీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిరువ్యాపారులు ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆయన చిరువ్యాపారులతో సమావేశమై మాట్లాడారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆహారపదార్థాల తయారీ కూడా పరిశుభ్ర వాతావరణంలోనే జరగాలన్నారు. అలాంటి ప్రదేశం ఉన్నచోటనే ప్రజలు కూడా ఎంచుకుంటారని, అప్పుడు వ్యాపారం కూడా బాగా జరుగుతుందని చెప్పారు. చిరువ్యాపారులు కష్టపడి ఎదగాలన్నదే మా ధ్యేయమన్నారు. వ్యసనాలకు బానిస కాకుండా, తప్పుడు మార్గాలు ఎంచుకోకుండా వ్యాపారాలను వృద్ధి చేసుకోవాలని సూచించారు. చిరువ్యాపారులు ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నట్లయితే బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు ఇప్పించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

కళ్యాణదుర్గం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. పట్టణంతో పాటు కంబదూరులోని పోలీస్ స్టేషన్లను శుక్రవారం తనిఖీ చేశారు. తొలుత పట్టణ పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఆయన అక్కడి సమస్యలను సిబ్బందితో ఆరా తీశారు. అలాగే మండలంలోని గొల్ల గ్రామంలో గ్రామసభ నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్, సైబర్ క్రైమ్ వల్ల కలిగే దుష్పరిణామాలను తెలియజేశారు. కనుక ఎవరూ వాటి జోలికి వెళ్లరాదని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే నష్టాలను వివరించారు. గ్రామంలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే వల్ల దొంగతనాలు అరికట్టవచ్చని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. తర్వాత కంబదూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రవిబాబు, పట్టణ, రూరల్ సీఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం

తాడిపత్రి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఐదునెలల పాలనలో కూటమి ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఐదునెలలకే ప్రజలకు చుక్కలు చూపిస్తోందని ఆరోపించారు. ఉచితగ్యాస్ పథకం కింద ప్రజలకు ఇస్తున్నది ఏడాదికి రూ.2684కోట్లు కాగా.. కరెంట్ సర్దుబాటు పేరుతో లాగుతున్నది రూ.6073కోట్లు అని చెప్పారు. త్వరలో ఛార్జీల పేరుతో మరోసారి రూ.11826కోట్లు అదనపు భారం ప్రజలపై మోపడానికి సిద్ధంగా ఉందన్నారు. ఉచితగ్యాస్ పథకం పాక్షికంగా అమలవుతోందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలుకావడం లేదని తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం ఊసేలేదన్నారు. నిరుద్యోగభృతి అతీగతీ లేదన్నారు. తల్లికి వందనం నిల్, తండ్రికి ఇంధనం ఫుల్ అన్నట్లుగా పాలన ఉందన్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్‌షాపులు దర్శనమిస్తున్నాయన్నారు. ఉచిత ఇసుక పాలసీ ఎక్కడుందని ప్రశ్నించారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్‌వైరు చోరీ

కుందుర్పి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపల్లి గ్రామానికి చెందిన రైతు నాగభూషణ వ్యవసాయ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని కాపర్‌ను అపహరించారు. పొలంలో వరి, మొక్కజొన్న సాగు చేశానని, గురువారం పంటకు నీరు పెట్టి సాయంకాలం ఇంటికి వచ్చానని, శుక్రవారం ఉదయం యథావిధిగా పొలంలోకి వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమై కనిపించిందని బాధితుడు తెలిపాడు. అందులోని కాపర్‌వైరు చోరీ అయినట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు వెంటనే మంజూరు చేయాలి

రాయదుర్గంరూరల్, నవంబరు 8: నియోజకవర్గంలోని రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు చెల్లించి ఏళ్లు గడుస్తోందని అయినా ఇంత వరకు అధికారులు మంజూరు చేయలేదని, ఇప్పటికైనా మంజూరు చేయాలని సీపీఐ రాయదుర్గం తాలూకా కార్యవర్గ సభ్యుడు క్రొట్రేష్ కోరారు. ఈ మేరకు పట్టణంలో విద్యుత్ కార్యాలయంలో ఏఈ బాలచంద్రకు శుక్రవారం వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా కొన్ని వందల మంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం విద్యుత్‌శాఖకు డీడీలు చెల్లించి ఏళ్లు గడుస్తోందన్నారు. ఇప్పటివరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ లేకపోతే రైతులు పంటలకు ఎలా నీరు పెట్టుకుంటారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దుర్గన్న, ఏపీ రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా అధ్యక్షుడు నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

పామిడి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అతివృష్టి, అనావృష్టి వల్ల ఖరీఫ్‌లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ శ్రీధరమూర్తికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... జిల్లాలో కేవలం 7 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించడం బాధాకరమన్నారు. మిగతా మండలాలను కూడా కరువుప్రాంతాలుగా ప్రకటించాలని కోరారు. అలాగే వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ ద్వారా అదనపు పనిదినాలు కల్పించి రూ. 600లకు తక్కువ కాకుండా వేతనం అమలు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు కే చంద్రమోహన్ రెడ్డి, కార్యదర్శి ముత్యాలు, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై వాగ్వాదం

- వాడీవేడిగా మండల సమావేశం

ఉరవకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యపైన టీడీపీమద్దతు సర్పంచ్ సుదీప్, వైసీపీ ఎంపీటీసీ సభ్యులు మునిస్వామి, పాపన్న మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వజ్రకరూరు మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయ భవనంలో శుక్రవారం ఎంపీపీ దేవి అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశాన్ని నిర్వహించారు. అజెండాలోని అంశాలపై ఎంపీడీవో చంద్రశేఖర్ చర్చ ప్రారంభించారు. ఎన్నికల సమయంలో నీటి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి కేశవ్ ఇచ్చిన హామీ ఏమైందని కొనకొండ్ల ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. దీంతో కడమలకుంట సర్పంచ్ సుదీప్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణనే గాలికి వదిలేసిందన్నారు. వైసీపీ నాయకుల నిర్వాకంతోనే తాగునీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. ఇందుకు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు ధీటుగా స్పందించారు. దీంతో వారి నడుమ కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు సభ్యులకు అధికారులు నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



వాగ్వాదం చేసుకుంటున్న సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు